


Truth of News
RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 196 | బుధవారం 07 జనవరి 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi



## 31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

- బడ్జెట్ తేదీపై సందిగ్ధం
- కీలక బిల్లు ప్రవేశపెట్టే అవకాశం

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

ఆర్థిక సంవత్సరానికి (2026-27) బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ నెల 31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. తొలి రోజున పార్లమెంట్ ఉభయ సభల సమావేశం జరగనుంది. సభనుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించనున్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

- మిగతా 2లో..

## కోనసీమలో ఓఎన్జీసీ గ్యాస్ బ్లోఅవుట్...

- రెండో రోజూ అదుపులోకి రాని మంటలు
- భద్రతా చర్యల్లో భాగంగా 500 కుటుంబాల తరలింపు
- సీఎం, డిప్యూటీ సీఎం పరిస్థితిని సమీక్షస్తున్నారని తెలిపిన ఎంపీ

మలికిపురం - సూర్య వాస్తవం



కోనసీమ జిల్లా మలికిపురం మండలం ఇరుసుమండ గ్రామంలోని ఓఎన్జీసీ బావిలో చెలరేగిన మంటలు రెండో రోజు కూడా అదుపులోకి రాలేదు. సోమవారం మధ్యాహ్నం మోరి-5 బావిలో రిపేర్ పనులు చేస్తుండగా అధిక పీడనంతో గ్యాస్, ముడి చమురు బయటకు చిమ్మి ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. ఈ ఘటనతో సమీప గ్రామాల్లో భయాందోళన వాతావరణం నెలకొంది. ఓఎన్జీసీ సాంకేతిక నిపుణులు, అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. అంతర్జాతీయ నిపుణుల సహాయం కూడా తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రమాద స్థలాన్ని పూర్తిగా ఆధీనంలోకి తీసుకుని, బావిని

- మిగతా 2లో..

# విడతల వారీగా సమీకరణ

- నేడు రాజధాని రెండోదశ పూలింగు
- తొలిగా వడ్డమాను, యండ్రాయిలో ప్రారంభం
- ఔటర్ రింగురోడ్డు, జాతీయ రహదారి, కృష్ణానది మధ్య మాస్టర్‌ప్లాను విస్తరణ
- విధిపోటు ప్లాట్ల సమస్య పరిష్కారం
- ఏడుగురు అనాథ చిన్నారులకు ప్రత్యేక పెన్షన్
- సీఎం సమీక్షలో నిర్ణయం



అమరావతి - సూర్య వాస్తవం

అమరావతి రాజధాని విస్తరణలో భాగంగా రెండోదశ పూలింగును నేడు ప్రారంభించనున్నారు. రెండోదశలో మొత్తం 20492 ఎకరాలు సమీకరించనున్నారు. దీనిలో 16,562.56 ఎకరాలు పట్టా భూమి, 104.01 ఎకరాలు అసైన్డ్ భూమి, 3828.30 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉంది. బుధవారం ఉదయం తుళ్లూరు మండల పరిధిలోని వడ్డమాను, అమరావతి మండల పరిధిలోని యండ్రాయి గ్రామంలో సమీకరణ ప్రారంభించనున్నారు. దీనిలో భాగంగా బుధవారం ఉదయం సిఆర్‌డిఏ కాంపిటెంట్ అథరిటీ కార్యాలయాలూ ప్రారంభించనున్నారు. మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన సిఆర్‌డిఏ అథరిటీ 57వ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ వివరాలను మంత్రి నారాయణ, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌కుమార్ మీడియాకు వివరించారు. రెండోదశ పూలింగులో భాగంగా పల్నాడు జిల్లా అమరావతి మండల పరిధిలోని నాలుగు గ్రామాల నుండి 9616 ఎకరాలు సమీకరించనున్నారు. ఇందులో పట్టాభూమి 7465 ఎకరాలు అసైన్డ్ భూమి 97 ఎకరాలు, ప్రభుత్వ భూమి 2054.23 ఎకరాలు ఉంది. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలంలోని మూడు గ్రామాల నుండి 10,878 ఎకరాలు

- మిగతా 2లో..

## 'పరకామణి' నీరుగార్చిన పోలీసులపై చర్యలు

- హైకోర్టు ఆదేశం

2లో



## బెయిల్ ఇవ్వండి..

- హైకోర్టులో టిటిడి మాజీ చైర్మన్ పీఏ పిటిషన్

అమరావతి - సూర్య వాస్తవం

తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యిని వినియోగించారనే కేసులో తనకు బెయిల్ ఇవ్వాలంటూ టిటిడి మాజీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి పిఏ చిన్న అప్పన్న మరోసారి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిని మంగళవారం జస్టిస్ యడవల్లి లక్ష్మణరావు

- మిగతా 2లో..

## సోషల్ మీడియాలో రెచ్చిపోతే ఇక కఠిన చర్యలే

- మంత్రి నారా లోకేశ్
- సోషల్ మీడియాలో విద్వేషపూరిత వ్యాఖ్యలపై కఠిన చర్యలు
- సద్విమర్శలను స్వాగతిస్తాం, కుట్రపూరిత పోస్టులను సహించబోమన్న లోకేశ్
- మహిళలపై అసభ్య పోస్టులు పెట్టేవారిపై ప్రత్యేక నిఘా
- ఇతర దేశాల చట్టాలను అధ్యయనం చేయాలని అధికారులకు సూచన



అమరావతి - సూర్య వాస్తవం

సోషల్ మీడియా వేదికగా కుట్రపూరితంగా విద్వేషాలు రెచ్చగొట్టే వారిపై ఉక్కుపాదం మోపుతామని, అటువంటి వారిపై అత్యంత కఠినంగా వ్యవహరిస్తామని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ హెచ్చరించారు. ప్రభుత్వ నిర్ణయాలపై వచ్చే సద్విమర్శలను మనస్ఫూర్తిగా స్వాగతిస్తామని, అయితే వాక్ స్వాతంత్ర్యం (ఫ్రీడమ్ ఆఫ్ స్పీచ్) పేరుతో వ్యవస్థీకృతంగా చేసే దుష్ప్రచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ఆయన స్పష్టం చేశారు. అమరావతి సచివాలయంలో ః సోషల్ మీడియా జవాబుదారీతనం, పౌరుల రక్షణః అనే అంశంపై ఏర్పాటైన మంత్రుల బృందం సమావేశంలో మంత్రి లోకేశ్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.

ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... "వ్యక్తిత్వ హననానికి

- మిగతా 2లో..



## స్థిరమైన అభివృద్ధి దిశగా వ్యవసాయ రంగం

- మంత్రి అచ్చెన్నాయుడు

అమరావతి - సూర్య వాస్తవం

రాష్ట్రంలో వ్యవసాయ రంగం సాంకేతికత, స్థిరమైన అభివృద్ధి దిశగా ముందడుగు వేస్తోందని వ్యవసాయశాఖ మంత్రి ి.అచ్చెన్నాయుడు తెలిపారు. విజయవాడలోని సమగ్ర జలవనరుల నిర్వహణ, రైతు శిక్షణ కేంద్రంలో సూక్ష్మనీటి సాగులో ఆటోమేషన్‌పై మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. నీటి వనరుల తగ్గుదల, వాతావరణ మార్పులు, సాగు వ్యయం పెరుగుదల వంటి సవాళ్ల మధ్య రైతులు నష్టపోకుండా ఉండాలంటే స్మార్ట్ వ్యవసాయానికి మళ్లాల్సిన అవసరం ఉందన్నారు. దేశానికి

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# విడతల వారీగా సమీకరణ

(మొదటిపేజీ తరువాయి)

సమీకరణ కింద తీసుకోనున్నారు. దీనిలో 9097.56 ఎకరాలు పట్టాభూమి, 7.01 ఎకరాలు అసైన్డ్, 627.34 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉంది. అయితే ఈసారి సమీకరణలో గ్రామాల వారీగా నోటిఫికేషన్ ఇచ్చి ఏ గ్రామానికి ఆ గ్రామంలో సమీకరణ ప్రక్రియ చేపట్టనున్నారు. ఇందులో భాగంగా బుధవారం తుళ్లూరు మండల పరిధిలోని వడ్డమానులో 1937 ఎకరాలకు నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. దీనిలో పట్టా భూమి 1763.29 ఎకరాలు, అసైన్డ్ 4.72 ఎకరాలు, ప్రభుత్వ భూమి 168.86 ఎకరాలు ఉంది. అలాగే అమరావతి మండల పరిధిలోని యండ్రాయి గ్రామంలో 2166 ఎకరాలకు నోటిపికేషన్ ఇవ్వనున్నారు. దీనిలో పట్టాభూమి 1879 ఎకరాలు, అసైన్డ్ 46 ఎకరాలు, ప్రభుత్వ భూమి 241 ఎకరాలు ఉంది. రాజధాని విస్తరణ లో భాగంగా స్మార్ట్ ఇండిస్ట్రీస్, అంతర్జాతీయ ఎయిర్ పోర్టు, ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ కట్టనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి వాటికి అథరిటీలోనూ ఆమోదం తెలిపామని పేర్కొన్నారు.

**తొలిదశలో రెండులైన్ల రోడ్లు**

రెండోదశలో సమీకరించే గ్రామాలకు సంబంధించి ప్రస్తుతం అమరావతిలో ఉన్న మాస్టర్‌ప్లానులో ఉన్న రోడ్లను అక్కడవరకూ పొడిగిస్తామని చెప్పారు. తొలి దశలో అన్నిచోట్లా రెండులైన్ల రోడ్లు వేసి సదుపాయాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. వాటిల్లో తాను కూడా పాల్గొంటున్నట్లు మంత్రి వివరించారు. సదుపాయాలు కల్పించాలని రైతులు కోరారని తెలిపారు. దీనిపై సిఎంతో మాట్లాడినట్లు తెలిపారు. మొదట రెండులైన్లు రోడ్లు, విద్యుత్, వంటి సదుపాయాలు కల్పిస్తామని అన్నారు. ప్రస్తుతం చేస్తున్న భూగర్భ డ్రైనేజీ, కేబుల్స్, మంచినీటి పైపులైన్లు ఏర్పాటు చేయాలంటే సమయం పడుతుందని, ఈలోపు ప్రాథమిక సదుపాయాలు కల్పిస్తామని, భవిష్యత్‌లో అభివృద్ధి చేస్తామని అన్నారు. మొత్తం పూలింగు అనంతరం రైల్వేట్రాక్, స్పోర్ట్‌సిటీ, ఇన్నర్‌రింగురోడ్డుకు పోను ప్రభుత్వానికి 2500 ఎకరాలు మాత్రమే వస్తుందని అన్నారు.

**మాస్టర్‌ప్లాను సిఆర్‌డిఎ రీజియన్‌కు విస్తరణ**

విజయవాడ చెన్నై జాతీయ రహదారి, కృష్ణానది, ఔటర్ రింగురోడ్డుకు కలిపి మాస్టర్‌ప్లాను విస్తరిస్తామని మంత్రి నారాయణ తెలిపారు. ప్రస్తుతం ఉన్న మాస్టర్‌ప్లానును తూర్పున విశాఖ చెన్నై జాతీయ రహదారి హద్దుగా ఉత్తరం కృష్ణానది, పశ్చిమ, దక్షణం ఔటర్ రింగురోడ్డు సరిహద్దు వరకూ విస్తరిస్తామని పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాలకు తగిన విధంగా అభివృద్ధి చేస్తామని మంత్రి వివరించారు. వీటితోపాటు ప్రస్తుత రాజధాని పరిధిలో ఉన్న జరీబు, నాన్ జరీబు సమస్యను 45 రోజుల్లో పరిష్కరిస్తామని చెప్పారు. దీనికోసం ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి కమిటీ బుధవారం నుండి పనిలో దిగుతుందని అన్నారు.

**754 పోస్టులకు అనుమతి**

సిఆర్‌డిఏ పరిధిలో 754 పోస్టులకు అనుమతి ఇచ్చినట్లు పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ తెలిపారు. సిఆర్‌డిఎలో జరుగుతున్న పనులకు వీలుగా సిఆర్‌డిఎలో నియామకాలు చేసుకునే విధంగా నిర్ణయించినట్లు చెప్పారు. భూమిలేని పేదలకు ఇచ్చే పెన్షన్ ఏడుగురు మైనర్లకు ఇచ్చారని, దీనికోసం చట్టాన్ని సవరించామని తెలిపారు. వారికి తల్లిదండ్రులు లేకపోవడం, అనాథలు కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

**అమరావతి మెరీనా ఏర్పాటు**

అమరావతి రాజధాని పరిధిలో రివర్ ఫ్రంట్ మెరీనాకు అథరిటీ అనుమతి ఇచ్చినట్లు సురేష్‌కుమార్ తెలిపారు. దీనికోసం ఎకరం భూమి కేటాయించామని బోటింగుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. కరకట్ట నుండి కృష్ణానది మధ్యలో దీన్ని ఏర్పాటు చేస్తామన్నారు.

**112 ప్లాట్లకు వీధిపోటు సమస్య పరిష్కారం**

రాజధాని రిటర్నబుల్ ప్లాట్లలో 112 ప్లాట్లకు సంబంధించి వీధిపోటు సమస్యపై ఫిర్యాదులొచ్చాయని వాటిపై అథరిటీలో చర్చించి పరిష్కరించాలని నిర్ణయించామని మంత్రి నారాయణ చెప్పారు. ప్లాట్లు యజమానుల దగ్గర ఉంటే మారుస్తామని, వేరే వ్యక్తులకు అమ్మిఉంటే మార్చబోమని తెలిపారు. నేరుగా రైతుల వద్ద ఉన్న ప్లాట్లు గుర్తించి వాటికి లాటరీ పద్ధతిలో వేరేచోట భూములు కేటాయిస్తామని అన్నారు. త్రీమెన్ కమిటీలోనూ పలు అంశాలను చర్చించి వాటిని పరిష్కరించాలని నిర్ణయించామని చెప్పారు.

**4.50 ఎకరాల సేకరణ**

ఉండవల్లి, పెనుమాక పరిధిలో సీడ్ యాక్సెస్‌రోడ్డుకు 4.50 ఎకరాలు ల్యాండ్ పూలింగుకు ఇవ్వలేదని, ఆయా భూముల రైతులతో సంప్రదింపులు జరిపామని మంత్రి చెప్పారు. రెండు ఎకరాలు ఇచ్చేందుకు ముందుకు వచ్చినా ఇప్పటికీ ఇవ్వలేదని, దీంతో వాటిని సేకరణ పద్ధతిలో తీసుకోవాలని నిర్ణయించినట్లు మంత్రి నారాయణ పేర్కొన్నారు.

దీనికీ బుధవారం నోటిపికేషన్ ఇస్తామని చెప్పారు. స్టీలు బ్రిడ్జి ఫిబ్రవరి నాటికి పూర్తవుతుందని, అప్పట్లోపు రోడ్డును పూర్తి చేయాలంటే సేకరణ అనివార్యమని అన్నారు. అమరావతి పరిధిలో ట్రంక్ ఇన్?అబశ్రీశ్రీఫ్రాస్ట్రక్చర్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. భవనాలు, ఎల్‌పిఎస్ లేఅవుట్లు, ఐదు పరిపాలనా భవనాల పనులు వేగంగా జరుగుతున్నాయని వివరించారు.

**ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం : పెదకూరపాడు ఎమ్మెల్యే ప్రవీణ్**

రాజధానిని పెదకూరపాడు నియోజకవర్గ పరిధిలోకి విస్తరించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు. దీనిపై గ్రామసభలు నిర్వహించామని, రైతులు ముందుకు వచ్చి భూములు ఇచ్చేందుకు అంగీకరించారని వివరించారు. తొలుత యండ్రాయిలో ప్రక్రియ ప్రారంభించి అనంతరం అన్ని గ్రామాలకూ విస్తరిస్తామని చెప్పారు. అమరావతి రాజధాని మాస్టర్‌ప్లాను విస్తరిస్తామని, ప్రత్యేకంగా మాస్టర్‌ప్లాను అవసరం లేదని పేర్కొన్నారు.

**పూలింగు ప్రక్రియ సాగేదిలా**

ఆంధ్రప్రదేశ్ క్యాపిటల్ రీజియన్ భూసమీకరణ పథకం 2025 రూల్స్‌లోని సెక్షన్ 55(4) కింద కాంపిటెంట్ అధికారి రెవెన్యూ గ్రామాల వారీగా పూలింగు ప్రకటన చేయనున్నారు. రైతులకు ఇచ్చే రిటర్నబుల్ ప్లాట్లను ఎపిసిఆర్‌డిఎ చట్టం 2014లో సెక్షన్ 43(3) కింద ఇవ్వనున్నారు. సెక్షన్ 48(1), 50 ప్రకారం రైతుల నుండి దరఖాస్తులు తీసుకోనున్నారు. పూలింగు ఏరియాలో నియమించే అధికారులు నోటిఫికేషన్ 1లో సూచించిన విధంగా 55(5) కింద అభ్యంతరాలనూ స్వీకరిస్తారు. సెక్షన్ 56(2) కింద భూములపై అభ్యంతరాలను తెలిపేందుకు 30 రోజలుపాటు అవకాశం కల్పించారు.

అనంతరం రైతుల నుండి సంక్రమించిన భూముల సరిహద్దులు, విస్తీర్ణాన్ని సర్వే చేస్తారు. రైతులు ఇచ్చిన దరఖాస్తులను ఆమోదించిన అనంతరం ప్లాట్లు తిరిగి ఇచ్చేందుకు గతంలో మాదిరి కాకుండా వన్‌టైం పాస్‌వర్డును వినియోగిస్తారు. 2025 పూలింగు చట్టంలో సెక్షన్లు 44, 53కి అనుగుణంగా అభివృద్ధి అవసరాలకు 50 శాతం భూమిని కేటాయించారు. దీనిలో పార్కులు, ఆటస్థలాలు, తోటలకు, ఓపెన్‌స్పేస్‌కు 10 శాతం, రోడ్లు, యుటిలిటీ సేవలకు 30 శాతం, సామాజిక సదుపాయాలకు ఐదుశాతం, గృహాలకు ఐదుశాతం కేటాయించనున్నారు.

**సెక్షన్ 57(2) ప్రకారం తుది నోటిఫికేషన్ జారీచేసిన అనంతరం భూమి సిఆర్‌డిఎ పరమవుతుంది.**

సెక్షన్ 57(3) ప్రకారం రైతులకు ల్యాండ్ పూలింగు ఓనర్‌షిప్ సర్టిఫిట్ ఇవ్వనున్నారు. దీనికి ప్రత్యేకంగా రిజిస్ట్రేషన్ అవసరం లేదు. ఈ సర్టిఫిట్‌ను ఆన్‌లైన్ పద్ధతిలోనే డౌన్‌లోన్ చేసుకోవచ్చు. అదే అసలు ధ్రువపత్రంగా గుర్తిస్తారు. పూలింగు ఏరియాలో జాయింట్ కలెక్టర్ నిర్ధారించిన అసైన్డ్, దేవాదాయ, వక్ఫ్ భూములపై అభ్యంతరాలను 15 రోజుల్లో తెలపాల్సి ఉంటుంది.

# కోనసీమలో ఓఎన్జీసీ గ్యాస్ బ్లోఅవుట్...

(మొదటిపేజీ తరువాయి)

చల్లబరిచే పనులు కొనసాగిస్తున్నారు. ప్రస్తుతానికి నీరు, మట్టితో మంటలు ఆర్పే ప్రయత్నం చేస్తున్నారు. అధికారులు రెండు లారీల్లో కూలెంట్ ను తీసుకువస్తున్నారు. దీని సాయంతో మంటలు ఆర్పడంలో పురోగతి కనిపిస్తుందని భావిస్తున్నారు. కోనసీమ జిల్లా కలెక్టర్ మహేశ్ కుమార్, ఎస్పీ రాహుల్ మీనా ఘటనా స్థలంలోనే ఉండి పరిస్థితిని పర్యవేక్షస్తున్నారు. ముందుజాగ్రత్త చర్యగా ఇరుసుమండ, మోరి గ్రామాలకు చెందిన సుమారు 500 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించారు. వారికి భోజనం, వైద్య సదుపాయాలు కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన అమలాపురం ఎంపీ గంటి హరీశ్ బాలయోగి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షస్తున్నారని చెప్పారు. బాధితులకు అన్ని విధాలా అండగా ఉంటామన్నారు.

# 31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

(మొదటిపేజీ తరువాయి)

ఏ తేదీన బడ్జెట్ ప్రవేశపెడతారనే విషయంపై స్పష్టతరావాల్సి ఉంది.

2017 నుంచి ఏటా ఫిబ్రవరి 1న బడ్జెట్ ప్రవేశపెట్టడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరి 1 ఆదివారం రావడంతో, బడ్జెట్ ప్రవేశ పెడతారా..? లేదా? అనే అంశంపై సందిగ్ధత నెలకొంది. ప్రభుత్వం బడ్జెట్‌ను ఫిబ్రవరి 2న ప్రవేశపెట్టొచ్చన్న అభిప్రాయం కూడా వ్యక్తమవు తుంది. దీనిపై కేబినెట్ కమిటీ నిర్ణయం తీసుకుంటుందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు.

**ఈ సమావేశాల్లో కీలక బిల్లు ?**

ఈ బడ్జెట్ సమావేశాల్లో వన్ నేషన్- వన్ ఎలక్షన్ బిల్లును ప్రవేశపెట్టే అవకాశం కనిపిస్తోంది. 30 రోజులకు పైగా జైలు జీవితం గడిపే సిఎంలు, మంత్రులను పదవి నుంచి తొలగించే బిల్లును కూడా ప్రవేశపెట్టేందుకు కేంద్రం సిద్ధమవుతున్నట్టు సమాచారం.

# బెయిల్ ఇవ్వండి..

(మొదటిపేజీ తరువాయి)

విచారించారు. సమగ్ర వివరాలను నివేదించాలని సిబిఐను ఆదేశించారు. విచారణను సంక్రాంతి సెలవుల తరువాత చేపడతామని ప్రకటించారు. నెయ్యి సరఫరాదారుల నుంచి కమీషన్ తీసుకున్నారన్న ఆరోపణలపై చిన్న అప్పన్నను సిబిఐ అరెస్టు చేసింది. డిసెంబర్‌లో బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా హైకోర్టు కొట్టివేసింది. దీంతో మళ్లీ బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు.

# సోషల్ మీడియాలో రెచ్చిపోతే ఇక కఠిన చర్యలే

(మొదటిపేజీ తరువాయి)

పాల్పడటం, మహిళలను కించపరిచేలా అసభ్యకర పోస్టులు పెట్టడం వంటి చర్యలను తీవ్రంగా పరిగణిస్తున్నాం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత డీప్ ఫేక్ కంటెంట్‌ను అరికట్టాలి. మహిళలపై అవమానకరమైన పోస్టులు పెట్టే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలి. ప్రజాభిప్రాయాన్ని అడ్డుకోవడం మా ఉద్దేశం కాదు. కానీ, కొందరు విదేశాల్లో ఉంటూ ఇక్కడి సామాజిక సామరస్యానికి భంగం కలిగించేలా పోస్టులు పెడుతున్నారు. వారిని గుర్తించి చర్యలు తీసుకునేందుకు వీలుగా బలమైన చట్టపరమైన వ్యవస్థను (లీగల్ ఫ్రేమ్‌వర్క్) రూపొందించాలి" అని అధికారులను ఆదేశించారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి భార్యపై అనుచిత పోస్టులు పెట్టిన వ్యక్తి తమ పార్టీకి చెందిన వాడైనా జైలుకు పంపించామని ఈ సందర్భంగా లోకేశ్ గుర్తుచేశారు. సోషల్ మీడియా నియంత్రణ కోసం ఇతర రాష్ట్రాలు, దేశాల్లో అమలవుతున్న చట్టాలను అధ్యయనం చేయాలని లోకేశ్ సూచించారు. ఆస్ట్రేలియా, యూరోపియన్ యూనియన్, యూకే వంటి దేశాల్లో స్వతంత్ర నియంత్రణ సంస్థలు పనిచేస్తూ భారీ జరిమానాలు విధిస్తున్నాయని ఆయన ప్రస్తావించారు. గతంలో న్యాయవ్యవస్థను లక్ష్యంగా చేసుకుని కూడా అసభ్య పోస్టులు పెట్టారని, ఇలాంటి ధోరణులకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు.

ఈ సమావేశంలో పాల్గొన్న హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ.. సైబర్ నేరాలకు సంబంధించి కేసుల నమోదు, చార్జిషీటు దాఖలులో జాప్యం జరుగుతోందని, ఈ ప్రక్రియను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. నెల రోజుల్లోగా చార్జిషీటు దాఖలు చేసేలా చర్యలు తీసుకోవాలని, విద్వేషపూరిత పోస్టులు పెట్టే వారి సోషల్ మీడియా ఖాతాలను తక్షణమే సస్పెండ్ చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రిటైర్డ్ న్యాయమూర్తులు, న్యాయ నిపుణుల సలహాలు తీసుకుని పటిష్టమైన చట్టాన్ని రూపొందిస్తామని, రాష్ట్రస్థాయిలో సమన్వయ సెల్స్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథితో పాటు హోం, న్యాయ, ఐటీ, సమాచార శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# స్థిరమైన అభివృద్ధి దిశగా వ్యవసాయ రంగం

(మొదటిపేజీ తరువాయి)

మార్గదర్శకమైన సూక్ష్మ నీటి సాగును మరింత బలోపేతం చేస్తూ, 'పర్ డ్రాప్ మోర్ క్రాప్' నుంచి 'పర్ డ్రాప్ మోర్ రిటర్న్స్' దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలిపారు. సెన్సార్లు, డేటా, ఆటోమేషన్ ఆధార సాగుతో 20 నుంచి 30 శాతం నీటి ఆదా, కార్మిక వ్యయాల తగ్గింపు, దిగుబడి, నాణ్యత పెంపు సాధ్యమవుతుందని తెలిపారు. ఇందుకోసం ప్రత్యేకంగా రూపొందించిన పథకాలతో రైతులకు రాయితీలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, ఉద్యాన శాఖ డైరెక్టర్ .శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# 'పరకామణి' నీరుగార్చిన పోలీసులపై చర్యలు - హైకోర్టు ఆదేశం

**అమరావతి - సూర్య వాస్తవం**

తిరుమల శ్రీవారి పరకామణిలో చోరీ కేసును నీరుగార్చేందుకు కుట్రదారులైన పోలీసులపై చర్యలు చేపట్టాలని హైకోర్టు ఆదేశించింది. కేసు బలహీనపరచడంలో కుట్రదారులైన పోలీసులపై తగిన చర్యలు తీసుకోవాలని మంగళవారం పేర్కొంది. సిఐడి ఇచ్చిన నివేదికను పరిశీలిస్తే నిందితుడు సివి రవికుమార్, ఇతరులతో కుమ్మక్కై కుట్రలకు పాల్పడిన పోలీసు అధికారులపై తగిన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఉద్దేశపూర్వకంగానే సరైన సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ దాఖలు చేయలేదని హైకోర్టు అభిప్రాయపడింది. అందువల్లే ఈ కేసు లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవడానికి దారితీసిందని పేర్కొంది. ఈ అంశం మినహా ఇతర అంశాలపై ఎసిబి, సిఐడి అధికారులు చట్టప్రకారం ముందుకువెళ్లవచ్చని చెప్పింది. రవికుమార్, ఆయన కుటుంబ సభ్యులు ఆదాయానికి మించిన ఆస్తులు ఆర్జించడం, ఆ ఆస్తులను టిటిడికి రాసివ్వడంపై ఎసిబి, సిఐడి ముందుకు వెళ్లవచ్చునని తెలిపింది. పరకామణిలో కానుకల లెక్కింపునకు వచ్చే భక్తులను తనిఖీ చేసే తీరు సహేతుకంగా లేదంటూ గతంలో తాము చేసిన సూచనలపై టిటిడి ఇఒ స్పందించకపోవడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. విచారణను గురువారానికి వాయిదా వేసింది. ఈ మేరకు జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ మంగళవారం ఆదేశాలను జారీ చేశారు. తిరుమలలో హుండీల నిర్వహణ, పరకామణిలో కానుకల లెక్కింపుపై టిటిడి సమర్పించిన సూచనల ప్లాన్-ఎలో వివరాలు అస్పష్టంగా ఉన్నాయని హైకోర్టు తప్పుపట్టింది. కానుకల లెక్కింపునకు వచ్చే భక్తులను తనిఖీ చేసే తీరు అమానవీయంగా ఉందని, ఇదే పరిస్థితి కొనసాగితే ఈ ప్రక్రియనే నిలిపివేస్తామని హెచ్చరించింది. వ్యక్తి గౌరవాన్ని రాజ్యాంగంలోని అధికరణ 21 నిర్దేశిస్తోందని గుర్తు చేసింది.

# మంత్రులను కలిసిన ఏపీ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ సభ్యులు







**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** ఆంధ్రప్రదేశ్ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ నెంబర్స్ మంగళవారం నాడు మంత్రులు రాష్ట్ర హోం మంత్రి మంగళపూడి అనిత, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ లను వారి ఛాంబర్లలో వెళ్లి పుష్ప గుచ్చం అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏపీఎస్పీ నుంచి ఏఆర్ కన్వర్షన్ గురించి మాట్లాడుతూ.... తెలంగాణ లోని 2013 బ్యాచ్ సంబంధించి కన్వర్షన్ కు వెళ్ళారని మన రాష్ట్రంలో 2004 బ్యాచ్ కు సంబంధించిన వారు ఉన్నారని 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఇంకా ఏ ఆర్ కన్వర్షన్ వచ్చేటట్లు లేదని చాలా మంది కానిస్టేబుల్స్ ఇబ్బందులు పడుతున్నారని హోం మంత్రి అనిత దృష్టికి తీసుకు వచ్చారు.ఒక్కసారి స్పెషల్ జీవో ఇస్తే అందరికీ న్యాయం జరుగుతుంది కాబట్టి ఒక్కసారి మా పై దయ తలిస్తే పోలీస్ కుటుంబాలు సంతోషంగా ఉంటారని ఆంధ్రప్రదేశ్ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ వారు తెలియజేశారు. హోంమంత్రి అనిత మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం పోలీసులకు అన్ని విధాలుగా న్యాయం చేస్తుందన్నారు.. సంక్రాంతి పండగ ముగిసిన తరువాత ప్రభుత్వం దృష్టికి తీస్కుల్లి అన్ని విధాలుగా సహకరిస్తామన్నారు.

**సరెండర్స్ లేక సిబ్బంది...ఇబ్బంది..!**

పోలీసులకు సరెండర్స్, టీఏ, డీఏలు రాకపోవడంతో చాలామంది ఇబ్బంది పడుతున్నారని ఈ విషయమై ఎన్నోసార్లు గత ప్రభుత్వం దృష్టికి తీసుకపోయాం. కానీ రాలేదని ఎంతోమంది తమ సిబ్బంది ఇబ్బందుల్లో ఉన్నారని సరెండర్స్ వస్తే తమ అవసరాలకు ఉపయోగపడతాయని ఎదురు చూస్తున్నారని అలాగే కర్నూలు జిల్లాకు సంబంధించి సరెండర్స్ పడలేదని సంక్రాంతి పండగా కు సరెండర్స్ పడే విధంగా చూడాలని ఆర్థిక శాఖ మంత్రి కేశవ్, హోంమంత్రి అనిత దృష్టికి ఏపీ పోలీస్ ఆఫీసర్ అసోసియేషన్ మెంబర్స్ తీస్కుళ్లగా వారు సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి ఈ ప్రక్రియను తీసుకువెళ్లి తొందరలోనే చేస్తామని హామీ ఇచ్చారు

# సంపాదకీయం

## తెగని నీటి పంచాయితీలు



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రెండు రాష్ట్రాలుగా విడిపోయి ఇప్పటికే పదేళ్లు దాటుతున్నా, నదీ జలాల వివాదాలు మాత్రం ఇంకా తీరని సమస్యగానే కొనసాగుతున్నాయి. రాష్ట్ర విభజన జరిగి మరో ఆరు నెలల్లో పన్నెండేళ్లు పూర్తవుతున్నా, నీటి పంచాయతీలు మాత్రం కొత్త కొత్త మలుపులు తిరుగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా గోదావరి, కృష్ణా నదీ జలాల విషయంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య పోరు తీవ్రంగా సాగుతోంది. ఈ వివాదాలు కేవలం సాంకేతిక అంశాలకే పరిమితం కాకుండా, రాజకీయ సెంటిమెంట్‌గా మారడంతో పరిష్కారం మరింత క్లిష్టంగా తయారైంది. రాష్ట్రం విడిపోయిన తర్వాత రెండు రాష్ట్రాలు కొత్త నీటి ప్రాజెక్టులపై దృష్టి పెట్టాయి. పెరుగుతున్న జనాభా, సాగునీటి అవసరాలు, తాగునీటి డిమాండ్, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అన్నీ కలిసి కొత్త ప్రాజెక్టుల నిర్మాణానికి దారితీస్తున్నాయి. అయితే కొత్త ప్రాజెక్టులు కట్టాలంటే నికర జలాలు ఎంత, మిగులు జలాలు ఎంత, సముద్రంలో వృథాగా కలిసే నీరు ఎంత అన్నది స్పష్టంగా తేలాల్సి ఉంది. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు కుదిరిన వాటా నిష్పత్తులను పక్కనపెట్టి తెలంగాణ తనకు ఎక్కువ వాటా కావాలని కోరుతుండగా, గతంలో నిర్ణయించిన విధంగానే నీటి పంపిణీ జరగాలని ఏపీ వాదిస్తోంది.ఏపీ వాదన ప్రకారం, దిగువ రాష్ట్రంగా ఉన్న కారణంగా సముద్రంలో కలిసే వృథా నీటిని వినియోగించుకునే హక్కు తమకుందని చెబుతోంది. అదే ఆధారంగా బనకచర్ల వంటి కొత్త ప్రాజెక్టులను నిర్మించాలని భావిస్తోంది. కానీ తెలంగాణ మాత్రం దీనిని పూర్తిగా తిరస్కరిస్తోంది. తమ రాష్ట్రంలో కూడా ప్రాజెక్టులు నిర్మిస్తే మిగులు నీరు ఎంత ఉందో తేలుతుందని, సముద్రంలో కలిసే నీటిలో కూడా తమ వాటా ఉందని తెలంగాణ అభిప్రాయం. కృష్ణా జలాల విషయానికి వస్తే విభజన తర్వాత ఏపీకి 66 శాతం, తెలంగాణకు 34 శాతం వాటా కేటాయించారు. అయితే తెలంగాణ దీనిని అంగీకరించకుండా 50-50 శాతం పంపిణీ కావాలని డిమాండ్ చేస్తోంది. మరోవైపు శ్రీశైలం , నాగార్జున సాగర్ వంటి ఉమ్మడి ప్రాజెక్టుల్లో నీటి వినియోగంపై స్పష్టమైన నియమాలు లేకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. శ్రీశైలంలో విద్యుత్ ఉత్పత్తి కోసం నీటిని ఎక్కువగా వినియోగించడం వల్ల ఏపీలో సాగునీటి అవసరాలు దెబ్బతింటున్నాయని ఆరోపణలు ఉన్నాయి. గోదావరి జలాల విషయంలో ఏపీకి 65 శాతం, తెలంగాణకు 35 శాతం వాటాలు నిర్ణయించారు. పోలవరం కారణంగా ముంపు ప్రాంతాలు పెరుగుతాయని తెలంగాణ అభ్యంతరం తెలుపుతుండగా, ఇది జాతీయ ప్రాజెక్ట్ అని కేంద్రం ( ద్వారా నిర్మాణం జరుగుతోందని ఏపీ సమాధానం ఇస్తోంది. బనకచర్ల ప్రాజెక్ట్‌ను నల్లమల సాగర్ గా పేరు మార్చి కొత్త డీపీఆర్ పంపినా, దానిపైనా అభ్యంతరాలు కొనసాగుతున్నాయి.ఈ వివాదాల మధ్య కోర్టు కేసులు, గ్రీన్ ట్రిబ్యునల్) స్టేలు కారణంగా ప్రాజెక్టులు నిలిచిపోతున్నాయి. అంచనా వ్యయాలు పెరుగుతుండగా, రైతులు నీటి హక్కులు కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. సెంట్రల్ వాటర్ కమిషన్ చైర్మన్ నేతృత్వంలో ఏర్పడిన ఈ కమిటీకి రెండు రాష్ట్రాల అధికారులు సభ్యులుగా ఉన్నారు. సాధారణంగా ఏపీ అంటే గులాబీ పార్టీకి నచ్చదు. అలా నచ్చితే ఆ పార్టీకి సెంటిమెంట్ వర్కౌట్ కాదు. అదే సమయంలో టిడిపి అన్న ఆ పార్టీకి పడదు. పడితే మళ్లీ తెలంగాణలో టిడిపి బతికేస్తుంది. అందుకే ఏపీతోపాటు టిడిపిని విపరీతంగా ద్వేషిస్తుంటారు గులాబీ నేతలు. ఈ అంశంపై నైనా మాట్లాడాలి అంటే అది ముందుగా చంద్రబాబు గురించి అయి ఉంటుంది. అంతలా అక్కడ విద్వేషం రెచ్చగొడితే గాని పని జరగదు. అటువంటి గులాబీ పార్టీ ఇప్పుడు చంద్రబాబు సర్కార్ చెప్పింది కరెక్ట్ అని చెబుతోంది. ఏపీ ప్రభుత్వం చెప్పినదానితో ఏకీభవిస్తోంది. తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు ఏపీ ప్రస్తావన వచ్చింది. చంద్రబాబు ప్రస్తావన తీసుకొచ్చారు సీఎం రేవంత్ రెడ్డి. రాయలసీమలో నిర్మించ తలపెట్టిన పోతిరెడ్డిపాడు ఎత్తిపోతల పథకాన్ని చంద్రబాబుతో మాట్లాడి తానే నిలుపుదల చేయించానని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. అయితే ఈ ప్రకటనపై మూడు పార్టీల నుంచి అభిప్రాయాలు వచ్చాయి. ముందుగా ఏపీ ప్రభుత్వం ఇది తప్పు అని.. రేవంత్ రెడ్డి చెప్పిన దాంట్లో నిజం లేదని తేల్చేసింది. గులాబీ పార్టీ సైతం ఏపీ ప్రభుత్వం చెప్పిందే నిజం అని పేరు చేసింది. కానీ ఏపీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రం తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తో చంద్రబాబు చీకటి ఒప్పందం అని ఆరోపిస్తోంది. అయితే ఇప్పుడు పోతిరెడ్డిపాడు ఎత్తిపోతల పథకం గురించి ప్రధానంగా చర్చ నడుస్తోంది.

పోతిరెడ్డిపాడు ప్రాజెక్టుఅనేది శ్రీశైలం ప్రాజెక్టు నుంచి కృష్ణా నది వరద నీటిని తరలించేందుకు నిర్మించ తలపెట్టినది. రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాలోని ప్రాజెక్టులకు మళ్ళించే ముఖ్యమైన నీటి నియంత్రణ వ్యవస్థ. అయితే జగన్మోహన్ రెడ్డి ఈ ప్రాజెక్టును ప్రతిపాదించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ ప్రాజెక్టును ప్రారంభించారు. కానీ ఈ ప్రాజెక్టుకు అవసరమైన ఏ అనుమతులు తీసుకోలేదు. దీంతో నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ తో పాటు కేంద్ర సంస్థల నుంచి అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. దీంతో 2020లోనే పోతిరెడ్డిపాడు ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులు నిలిచిపోయాయి. జగన్ ఈ ప్రాజెక్టు ప్రతిపాదన చేసిన సమయంలోనే తెలంగాణలో అధికార పార్టీగా ఉన్న బిఆర్ఎస్, విపక్షంలో ఉన్న కాంగ్రెస్ అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ అప్పటి కేంద్ర ప్రభుత్వానికి లేఖలు కూడా రాశాయి. అయితే కేవలం రాజకీయ ప్రయోజనాలకు.. తెలంగాణలో తన మిత్రుడు కేసీఆర్ కు లబ్ధి చేకూర్చే విధంగా.. జగన్మోహన్ రెడ్డి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా, చిత్తశుద్ధి లేకుండా ఈ పథకాన్ని ప్రారంభించారని అప్పట్లో విమర్శలు వచ్చాయి. 2020 తోనే ఈ ప్రాజెక్టు నిర్మాణం అలానే ఉండిపోయింది.జగన్మోహన్ రెడ్డి హయాంలో ఆ ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయని చెప్పడం లేదు. అసలు జగన్ ప్రస్తావన తేవడం లేదు. దీనిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు హరీష్ రావు. ఎక్కడ జగన్మోహన్ రెడ్డి హయాంలో నిలిచిపోయింది అని చెబితే తన మిత్రుడికి పొలిటికల్ డామేజ్ జరుగుతుంది. అన్నింటికీ మించి చంద్రబాబు ప్రస్తావన ఉండదు. అందుకే మధ్య మార్గంలో ఏపీ సర్కార్ అభిప్రాయంతో ఏకీభవిస్తోంది గులాబీ పార్టీ. అయితే అసలు చంద్రబాబుకు సంబంధం లేదు. జగన్మోహన్ రెడ్డికి చిత్తశుద్ధి లేక నిలిపివేసిన ప్రాజెక్టు అది. కానీ అనవసరంగా చంద్రబాబు పేరు తీసుకొచ్చారు రేవంత్ రెడ్డి. తాను ఆపిన ప్రాజెక్టు నిర్మాణం శాపాన్ని చంద్రబాబు పై నెట్టేసే ప్రయత్నం చేస్తున్నారు జగన్ మోహన్ రెడ్డి. అసలు టిడిపి, చంద్రబాబు గాలిపడని గులాబీ పార్టీ సైతం జగన్కు నష్టం లేకుండా ఆయన పేరు ప్రస్తావించడం లేదు. ఇలా తెలుగు రాష్ట్రాల రాజకీయాలు అన్ని చంద్రబాబు చుట్టూనే తిరుగుతున్నాయి.ఈ కమిటీ నివేదిక ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందన్న ఆశ ఉన్నా, రాజకీయ సెంటిమెంట్లు అడ్డంకిగా మారతాయా అన్నదే ఇప్పుడు ప్రధాన చర్చ. ఏదేమైనా కేంద్ర జోక్యంతో అయినా ఈ జల జగడాలకు ముగింపు పడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# రాయలసీమకు ద్రోహం చేసిందెవరు.?

**కర్నూలు- సూర్య వాస్తవం**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా చేసిన ఒక్క ప్రకటన ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మంటలు రేపింది. "రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని నేనే చంద్రబాబుతో మాట్లాడి ఆపించాను" అని రేవంత్ చెప్పడమే ఆలస్యం.. ఏపీలో ప్రతిపక్ష వైసీపీ భగ్గుమంది. చంద్రబాబును 'రాయలసీమ ద్రోహి'గా చిత్రీకరిస్తూ ఆందోళనలకు దిగింది. అయితే, తెలంగాణ మాజీ మంత్రి హరీశ్ రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అసలు నిజాలను బయటపెట్టడంతో సీన్ రివర్స్ అయ్యింది. జగన్ హయాంలోనే ఈ ప్రాజెక్టు పనులు ఆగిపోయాయని ఆయన ఆధారాలతో సహా చూపించారు. ఈ పరస్పర విరుద్ధ ప్రకటనల నేపథ్యంలో అసలు రాయలసీమ ఎత్తిపోతలకు బ్రేకులు వేసింది ఎవరు? 2019-24 మధ్య ఏం జరిగింది? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్‌ను ఇరకాటంలో పెట్టే క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబుతో తనకు ఉన్న సాన్నిహిత్యాన్ని ప్రస్తావించారు. అక్రమ ప్రాజెక్టులను ఆపడంలో తాము సఫలమయ్యామని చెప్పే ప్రయత్నంలో రాయలసీమ ఎత్తిపోతల ప్రస్తావన తెచ్చారు. దీన్ని వైసీపీ అందిపుచ్చుకుంది. తెలంగాణ సీఎంకు తలొగ్గి చంద్రబాబు రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టారని, సీమ గొంతు కోశారని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. పలు జిల్లాల్లో నిరసనలకు దిగారు.వైసీపీ ఆరోపణలు ఇలా ఉంటే.. హరీశ్ రావు మాత్రం తన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ లో లెక్కలతో సహా వాస్తవాలను బయటపెట్టారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల కారణంగా జగన్ అధికారంలో ఉన్నప్పుడే ఈ ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయని ఆయన గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి ఇప్పుడు కొత్తగా ఆపించింది ఏమీ లేదని, అసలు అక్కడ పనులే జరగడం లేదని తేల్చి చెప్పారు. ఇది పరోక్షంగా జగన్ హయాంలో



జరిగిన వైఫల్యాన్ని ఎత్తిచూపినట్లయింది.రాయలసీమ ఎత్తిపోతల పథకం ద్వారా పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని పెంచి, రోజుకు 3 టీఎంసీల నీటిని తరలించాలని జగన్ ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకోసం 2020లో జీవో 203ని విడుదల చేసింది. అయితే, దీనికి పర్యావరణ అనుమతులు లేవని తెలంగాణ ప్రభుత్వం అప్పట్లో ఎన్జీటీని ఆశ్రయించింది. విచారణ జరిపిన ఎన్జీటీ, పర్యావరణ అనుమతులు వచ్చే వరకు పనులు చేపట్టవద్దని స్టే ఇచ్చింది. జగన్ ప్రభుత్వం ఈ అనుమతులు సాధించడంలో విఫలమైంది. అంతేకాకుండా, ఎన్జీటీ ఆదేశాలను ధిక్కరించి పనులు చేశారన్న ఆరోపణలపై ఏపీ అధికారులకు కోర్టు ధికార నోటీసులు కూడా వచ్చాయి. ఫలితంగా, టెండర్లు పిలిచి కాంట్రాక్టర్ ను నియమించినా, క్షేత్రస్థాయిలో పనులు ముందుకు సాగలేదు. హరీశ్ రావు చెప్పిన పాయింట్ ఇదే. జగన్ హయాంలోనే చట్టపరమైన చిక్కులతో ప్రాజెక్టు స్తంభించిపోయింది. 2024లో జగన్ ఓడిపోయారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చారు. టీడీపీ వచ్చి ఏడాదిన్నరే అయింది. ఎన్జీటీ స్టే ఇంకా కొనసాగుతోంది. ఈ తరుణంలో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు చంద్ర బాబును ఇబ్బందికర పరిస్థితిలోకి నెట్టాయి. ఒకపక్క తెలంగాణతో సత్సంబంధాలు కోరుకుంటున్న చంద్రబాబు, మరోపక్క రాయలసీమ సెంటిమెంట్ ను విస్మరించలేరు. రేవంత్ వ్యాఖ్యలపై టీడీపీ నేతలు స్పందిస్తూ.. "మేము ప్రాజెక్టు ఆపేస్తామని ఎక్కడా చెప్పలేదు, చట్టపరమైన అనుమతులు తెచ్చుకుని కడతాం" అని కౌంటర్ ఇస్తున్నారు. రేవంత్ రెడ్డి కేవలం తెలంగాణలో పొలిటికల్ మైలేజ్ కోసమే ఆ వ్యాఖ్యలు చేశారని టీడీపీ వాదన. వాస్తవాలను పరిశీలిస్తే.. ఇక్కడ ఎవరూ పూర్తిగా రైట్ కాదు. ప్రాజెక్టును ఆర్భాటంగా ప్రకటించినా, పర్యావరణ అనుమతులు సాధించ డంలో జగన్ ప్రభుత్వం విఫలమైంది. చట్ట పరంగా బలమైన అడుగులు వేయలేక పోవడం వల్లే ప్రాజెక్టు ఎన్జీటీ స్టేలో చిక్కుకుంది. కాబట్టి పనులు ఆగిపోవడానికి ప్రధాన కారణం జగన్ ప్రభుత్వ వైఫల్యమే. రేవంత్ రెడ్డి 'నేను చెప్తే బాబు ఆపారు' అని అంటుంటే.. చంద్రబాబు ప్రభుత్వం నుండి గట్టి కౌంటర్ రాకపోవడం సీమ ప్రజల్లో అనుమానాలకు తావిస్తోంది. కేసీఆర్ ను కార్నర్ చేయడానికి రేవంత్ వాడిన అస్త్రం.. పక్క రాష్ట్రంలో మంటలు రేపింది. అక్కడ పనులు జరగడం లేదని తెలిసీ, తానే ఆపించానని చెప్పుకోవడం పూర్తిగా రాజకీయ ఎత్తుగడ.అసలు విషయం ఏంటంటే.. ప్రస్తుతం రాయలసీమ ఎత్తిపోతల పనులు జరగడం లేదు. అవి జగన్ హయాంలోనే ఎన్జీటీ కేసుల వల్ల ఆగిపోయాయి. ఇప్పుడు కొత్తగా చంద్రబాబు ఆపిందేమీ లేదు, రేవంత్ ఆపించిందీ ఏమీ లేదు. కానీ, ఇద్దరు సీఎంల మధ్య ఉన్న దోస్తీని అడ్డం పెట్టుకుని వైసీపీ రాజకీయం చేస్తుంటే, గతాన్ని గుర్తు చేస్తూ హరీశ్ రావు వాస్తవాలను బయటపెట్టారు. అంతిమంగా రాజకీయ నాయకుల మాటల యుద్ధంలో రాయలసీమ నీటి హక్కులు పక్కదారి పడుతున్నాయన్నది చేదు నిజం.

# అడ్డంగా బుక్కైన టీడీపీ నేత

**తిరుపతి - సూర్య వాస్తవం**

రాజకీయ అధికారాన్ని అడ్డం పెట్టుకుని ప్రభుత్వ భూములను, మాజీ సైనికులకు కేటాయించిన స్థలాలను చెరబట్టారనే ఆరోపణలు అన్నమయ్య జిల్లా రాజకీయాల్లో ఇప్పుడు పెనుప్రకంపనలు సృష్టిస్తు న్నాయి. మదనపల్లె టీడీపీ మాజీ ఎమ్మెల్యే దొమ్మల పాటి రమేష్‌పై వచ్చిన భూ ఆక్రమణ ఆరోపణలపై లోకాయుక్త సీరియస్ అయ్యింది. పేదలకు, సైనికులకు చెందాల్సిన భూములను నకిలీ పత్రాలతో కాజేసిన వైనంపై కలెక్టర్ నివేదిక ఇవ్వడంతో ఈ వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది.మదనపల్లె నియోజకవర్గం పరిధిలోని బి.కె.పల్లి గ్రామంలో సర్వే నంబర్ 8/1లో ఉన్న సుమారు మూడు ఎకరాల భూమి చుట్టూ ఈ వివాదం ముడిపడి ఉంది. ఇది ప్రభుత్వ రికార్డుల ప్రకారం 'చెరువు పోరంబోకు' భూమి. దీనిని గతంలో దేశం కోసం పోరాడిన మాజీ సైనికులకు ప్రభుత్వం కేటాయించింది. అయితే, 2016లో దొమ్మలపాటి రమేష్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తన రాజకీయ పలుకుబడిని ఉపయోగించి ఈ భూమిని కబ్జా చేశారనేది ప్రధాన ఆరోపణసుమారు 2.92 ఎకరాల ఈ విలువైన భూమిని నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి, మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్, ఆయన భార్య సరళ పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. కోట్లాది రూపాయల విలువ చేసే ఈ ప్రభుత్వ భూమిని ప్రైవేట్ ఆస్తిగా మార్చుకునే క్రమంలో రెవెన్యూ చట్టాలను, నిబంధనలను తుంగలో తొక్కినట్లు అధికారుల విచారణలో తేలింది. ఈ భూ కుంభకోణంలో కేవలం రాజకీయ నాయకులే కాదు, బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న రెవెన్యూ అధికారులు కూడా కీలక పాత్ర పోషించడం విస్మయం కలిగిస్తోంది. అప్పటి తహశీల్దార్ శివరామిరెడ్డి, ఆర్ఐ, విఆర్ఓ లు ఎమ్మెల్యేతో కుమ్మక్కై రికార్డులను తారుమారు చేశారు.మరీ ముఖ్యంగా, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు రోజైన ఆదివారం తహశీల్దార్ కార్యాలయం తెరిచి మరీ రికార్డులను మార్చినట్లు విచారణలో బయటపడింది. ఆన్‌లైన్ రికార్డుల్లో పేర్లు మార్చడం, నకిలీ పట్టాలు సృష్టించడం వంటివి అత్యంత పథకం ప్రకారం జరిగాయి. సాక్షాత్తు జిల్లా కలెక్టర్ ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో ఈ విషయాన్ని స్పష్టంగా పేర్కొనడం గమనార్హం. మాజీ ఎమ్మెల్యే ఒత్తిడికి తలొగ్గి, నిబంధనలకు విరుద్ధంగా అధికారులు సహకరించారని కలెక్టర్ నివేదిక నిర్ధారించింది. ఈ అక్రమాలపై దాఖలైన ఫిర్యాదును విచారించిన లోకాయుక్త న్యాయస్థానం తీవ్రంగా స్పందించింది. మాజీ సైనికులకు ఇవ్వాల్సిన భూమిని కబ్జా చేయడం, చెరువు పోరంబోకు భూమిని ఆక్రమించడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. కలెక్టర్ నివేదిక ఆధారంగా తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. దీంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. ఈ అక్రమాలకు సహకరించిన ఐదుగురు ప్రభుత్వ అధికారులపై క్రమశిక్షణా చర్యలకు ఆదేశాలు జారీ చేసింది. అంతేకాకుండా, ఆంధ్రప్రదేశ్ భూ ఆక్రమణ చట్టం కింద బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని స్పష్టం చేసింది. మదనపల్లెలో ఇటీవల సబ్-కలెక్టర్



కార్యాలయంలో ఫైళ్ల దగ్ధం ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఆ ఘటన మరువకముందే, ఇప్పుడు మాజీ ఎమ్మెల్యేపై భూ కబ్జా ఆరోపణలు రుజువు కావడం, లోకాయుక్త జోక్యం చేసుకోవడం దొమ్మలపాటి రమేష్ రాజకీయ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసే అవకాశం ఉంది. సాధా రణంగా రాజకీయ ఆరోపణలు వేరు, సాంకేతిక ఆధా రాలతో కూడిన అధికారుల నివేదికలు వేరు. ఇక్కడ కలెక్టర్ స్వయంగా విచారణ జరిపి, రికార్డుల తారు మారుని నిర్ధారించడం మాజీ ఎమ్మెల్యేకు పెద్ద ఎదురు దెబ్బే. రాబోయే రోజుల్లో ఈ కేసు విచారణ ఎలా సాగు తుంది? క్రిమినల్ కేసుల నమోదు తర్వాత అరెస్టుల వరకూ వెళ్తుందా? అన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. ఏది ఏమైనా, కంచే చేను మేసిన చందంగా రక్షించాల్సిన ప్రజాప్రతినిధులే భక్షకులుగా మారారన్న విమర్శలకు ఈ ఘటన బలం చేకూరుస్తోంది.

# మారుతున్న సమీకరణాలు

**విశాఖపట్టణం- సూర్య వాస్తవం**

ఉత్తరాంధ్రలో భోగాపురం అంతర్జాతీయ విమానా( శయం అందుబాటులోకి వచ్చింది. ఎయిర్‌పోర్ట్ ట్రయల్ రన్ కూడా పూర్తయింది. జూన్‌లో విమానాశ్రయాన్ని ప్రారంభించి.. జూలై నుంచి విమాన రాకపోకలు మొదలయ్యేలా చూడనున్నారు. ఎయిర్పోర్ట్‌తో ఉత్తరాంధ్ర స్వరూపమే మారనుంది. అయితే ఇప్పుడు ఏపీలోనే భోగాపురం నియోజకవర్గం ఎంతో ప్రాధాన్యత కలిగిన రాజకీయ ప్రాంతం. అందుకే అక్కడ పట్టు కోసం అన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నాలు చేస్తాయి. ప్రస్తుతం ఇక్కడ జనసేన ఎమ్మెల్యే లోకం మాధవి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే వచ్చే ఎన్నికల్లో ఈ స్థానం టిడిపి తీసుకుంటుందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. భోగాపురం లాంటి ప్రాంతంలో అధికార పార్టీ ముద్రగా చూపాలన్నది టిడిపి నుంచి వస్తున్న అభిప్రాయం. పైగా ఈ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీకి క్షేత్రస్థాయిలో పట్టున్న ప్రాంతం. అందుకే వచ్చే ఎన్నికల్లో జనసేన ను తప్పించి.. తిరిగి టిడిపికి ఈ స్థానం కేటాయిస్తారని ప్రచారం జరుగుతోంది.భోగాపురం ఎయిర్పోర్ట్ కు అనుబంధంగా పర్యాటక ప్రాజెక్టులు సైతం రానున్నాయి. ఇందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం 500 ఎకరాల భూమిని రిజర్వు కూడా చేసింది. మొన్నటి ఎన్నికల్లో నెల్లిమర్ల నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయించారు. అయితే ఇక్కడ తెలుగుదేశం పార్టీ బలంగా ఉంది. కానీ రాష్ట్రస్థాయిలో కుదిరిన పొత్తుల వల్ల ఈ స్థానాన్ని జనసేనకు కేటాయించాల్సి వచ్చింది. అయితే భోగాపురం ఎయిర్పోర్ట్ తో ఉత్తరాంధ్ర కేంద్రంగా ఈ నియోజకవర్గం మారనుంది. అందుకే ఎంత మాత్రం ఈ నియోజకవర్గాన్ని వదిలి పెట్టేందుకు తెలుగుదేశం పార్టీ అంగీకరించదన్న టాక్ నడుస్తోంది. పైగా జనసేన ఎమ్మెల్యే పై అనేక రకాల ఆరోపణలు వస్తున్నాయి. కూటమి శ్రేణులను సమన్వయం చేసుకోలేకపోతున్నారన్న విమర్శ ఉంది. పైగా ఇక్కడ తెలుగుదేశం పార్టీ బలంగా ఉండడం.. జనసేన ఎమ్మెల్యే పట్టించుకోకపోవడంతో ఒక రకమైన గందరగోళం ఉంది. అందుకే ఈ నియోజకవర్గాన్ని టిడిపికి విడిచి పెట్టి.. మరో నియోజకవర్గాన్ని జనసేన ఎంచుకుంటుందన్న టాక్ కూడా నడుస్తోంది.మరోవైపు వచ్చే ఎన్నికల్లో ఇక్కడ నుంచి టిడిపి అభ్యర్థిగా అశోక్ గజపతిరాజు కుమార్తె అదితి గజపతిరాజు పోటీ చేస్తారన్న ప్రచారం కూడా ఉంది. విజయనగరం అసెంబ్లీ స్థానాన్ని జనసేనకు విడిచిపెడతారని.. ఇక్కడ మాత్రం టిడిపి తీసుకుంటుందన్న టాక్ నడుస్తోంది. జనసేనకు ఇప్పటికే పాలవలస యశస్విని అనే మహిళ నేత నాయకురాలిగా ఉన్నారు. మొన్నటి ఎన్నికల్లో విజయనగరం అసెంబ్లీ టికెట్ ఆశించారు. అయితే కూటమి అధికారంలోకి రావడంతో ఆమె తూర్పు కాపు కార్పొరేషన్ చైర్ పర్సన్ పదవి వరించింది. అయితే ఈసారి తూర్పు కాపు సామాజిక వర్గానికి విజయ నగరంలో ప్రాధాన్యం ఇవ్వాలని చూస్తోంది కూటమి. ఎందుకంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ.. తూర్పు కాపు సామాజిక వర్గాన్ని తెరపైకి తెస్తోంది. అందుకు ధీటుగా కూటమి జనసేనకు టికెట్ ఇచ్చి.. తూర్పు కాపు సామాజిక వర్గానికి చెందిన యశస్వినికి అవకాశం ఇస్తారని తెగ ప్రచారం జరుగుతుంది. అయితే నెల్లిమర్ల వెళ్లేందుకు అదితి గజపతిరాజు ఒప్పుకుంటారా? ఈ ప్రచారంలో నిజం ఎంత ఉంది? అనేది త్వరలో తెలుస్తుంది.

# పార్లమెంట్ సభ్యులు మిథున్ రెడ్డిని కలిసిన సిరాజ్ భాషా




**నాయుడుపేట- సూర్య వాస్తవం:** వైసిపి మాజీ రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి నివాసంలో రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రములో మైనారిటీల యొక్క సమస్యలపై వారితో చర్చించారు కొంతసేపు రాజకీయాలను వాళ్లు చర్చించుకున్నట్లు సమాచారం. అనంతరం మాజీ రాష్ట్ర మంత్రివర్యులు రామచంద్రారెడ్డి సతీమణి పెద్దిరెడ్డి స్వర్ణ లతమ్మను. రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి. శాల వాళ్లతో సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి షేక్ సిరాజ్ భాషా మాట్లాడుతూ ఎన్ని కష్టాలు ఎదురైనా వైయస్సార్సీపి పార్టీని బలోపేతం చేయ టానికి అహర్నిశలు కృషి చేస్తానని ఆయన తెలిపారు. అదేవిధంగా మా పెద్దాయన పెద్ద రెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబంతోనే మా యొక్క జీవన శైలి కొనసాగుతుందని ఆయన తెలిపారు. మా పెద్దాయన కుటుంబం చల్లగా ఉంటే ఎంతోమంది పేద బడుగు బలహీన వర్గాలకు అండగా ఉంటుందని ఆయన తెలిపారు.

# చంద్రగిరి గొల్ల రాధాకి భగవద్గీతను ఇచ్చిన నాయకులు



**గుత్తి -సూర్య వాస్తవం :** గుత్తి మండలం ఉభిచెర్ల గ్రామం నాయకులు వైసీపీ మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షులు చంద్రగిరి గొల్ల రాధా జన్మదిన శుభాకాంక్షలు సందర్భంగా ఆత్మయ కలయిక సందర్భంగా ఊబిచర్ల గ్రామ నాయకులు ముందుగా శ్యాల్వ కప్పి పూల దండలు వేసి కేకు కట్ చేసి ఒకరికొకరు కేక్ తినిపించుకొన్నారు. ఈ కార్యక్రమానికి పి వెంకటేష్,మాజీ డీలర్,పి చిన్నాన్న,పి శ్రీనివాసులు, డిఓబులేసు, పి రవి,ఎన్ రంగనాయకులు,పి ఓబయ్య,పి చంద్ర,వై శ్రీ నివాసులు తదితరులు పాల్గోని పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి భగవద్గీత ఇవ్వడం జరిగింది.

# 8న అనంతపురం మార్కెట్ యార్డ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

**- ఎమ్మెల్యే దగ్గుపాటి ని ప్రత్యేకంగా ఆహ్వానించిన చైర్మన్ బల్లాపల్లవి వైస్ చైర్మన్ అర్షదుల్లా**

**- ముందస్తుగా శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్**



**అనంతపురం - సూర్య వాస్తవం:** అనంతపురం మార్కెట్ యార్డ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి భారీ ఏర్పాట్లు సాగుతున్నాయి. ఈ నెల 8న జరగనున్న ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ని ప్రత్యేకంగా ఆహ్వానించారు. టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యేను నూతన కమిటీ సభ్యులు కలిశారు. చైర్మన్ బల్లా పల్లవి, వైస్ ఛైర్మన్ అర్షదుల్లాతో పాటు, మార్కెట్ ఉన్నతాధికారి రాఘవేంద్ర, ఇతర కమిటీ సభ్యులు ఆయన్ని ప్రత్యేకంగా ప్రమాణ స్వీకారోత్సవానికి ఆహ్వానించారు. ముందస్తుగా నూతన కమిటీకి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. అనంతపురం మార్కెట్ యార్డును రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిపే విధంగా పనిచేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గారు సూచించారు. రైతులకు మార్కెట్ యార్డులో అన్ని సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వారికి సూచించారు.

# ఘనంగా పెద్దమ్మ జాతర

**పామిడి -సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా పామిడి మండల కేంద్రంలోని నారాయణస్వామి వీధిలో సొంత మార్కెట్ నందు పెద్దమ్మ జాతరను భక్తిశ్రద్ధలతో మంగళవారం ఘనంగా నిర్వహించడం జరిగింది. పెద్దమ్మ విగ్రహానికి వివిధ రకాల పూల మాలలతో అలంకరించి, ప్రత్యేక పూజలను నిర్వహించడం జరిగింది. ఈ జాతరలో భాగంగా సొంత మార్కెట్ వీధికి చెందినటువంటి శేఖర్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో శేఖర, శివ, ధన,బంధుమిత్రులు , భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.




# జగన్ బొమ్మలకు చెక్.. రైతు హక్కులకు రాజముద్ర

**- ప్రభుత్వ ముద్రతో కొత్త పట్టాదారుపాసుపుస్తకాల పంపిణీ**

**- కొమ్మినేనిపల్లిలో “మీ భూమి మీ హక్కు” కార్యక్రమం**

**- ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుతో రైతులకు చట్టబద్ధ భరోసా**




**పెళ్లకూరు- సూర్య వాస్తవం:** సూళ్లూరుపేట మండలం ఆబాక పంచాయతీ పరిధిలోని కొమ్మినేనిపల్లి గ్రామంలో నిర్వహించిన “మీ భూమి మీ హక్కు” కార్యక్రమం రైతులకు కొత్త ఆశను నింపింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సూళ్లూరుపేట శాసనసభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ రైతులకు ప్రభుత్వ రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయశ్రీ విలేకరులతో మాట్లాడుతూ, గత పాలనలో భూమి పత్రాలపై వ్యక్తిగత బొమ్మలను ముద్రించడం వల్ల రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులకు ఇప్పుడు పూర్తిగా చెక్ పడిందని అన్నారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసి రైతుల భూమి హక్కులకు చట్టబద్ధ భరోసా కల్పించిందని స్పష్టం చేశారు.

**వైసీపీ పాలనలో భూమి గందరగోళం**

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భూమి పత్రాలపై, సర్వే రాళ్లపై జగన్ బొమ్మలు ముద్రించడం ద్వారా రైతులను



మానసికంగా, చట్టపరంగా ఇబ్బందులకు గురిచేశారని ఎమ్మెల్యే విమర్శించారు. అసంబద్ధమైన రీఉసర్వే కారణంగా రైతుల భూములకు భద్రత కోల్పోయి, అనేక వివాదాలు తలెత్తాయని తెలిపారు.

**రైతు పక్షపాతమే ప్రభుత్వ విధానం**

ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతుల ప్రయోజనాలనే కేంద్రంగా పాలన సాగిస్తోందని విజయశ్రీ పేర్కొన్నారు. రీఉసర్వేలో జరిగిన తప్పులను సరిదిద్ది, ప్రతి రైతుకు వారి భూమిపై పూర్తి హక్కు ఉండేలా ప్రభుత్వ రాజముద్రతో పత్రాలు అందజేస్తున్నామని వెల్లడించారు.

**రాజముద్ర ఉ రైతు గౌరవానికి చిహ్నం**

భూమి పత్రాలపై ప్రభుత్వ రాజముద్ర ఉండటం రైతు గౌరవానికి ప్రతీక అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కొమ్మినేనిపల్లి గ్రామంలో లబ్ధిదారులకు ఈ పత్రాలను అందజేయడం ఆనందంగా ఉందని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఇది మంచి ప్రభుత్వం అన్న నినాదానికి అనుగుణంగా పాలన సాగు తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజా ప్రతినిధులు, అధికారులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# రైతుల అభివృద్ధే లక్ష్యంగా ఏఎంసీ చర్యలు

**- నాయుడుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ సమావేశంలో ఆదాయంవ్యయాల సమీక్ష**





**నాయుడుపేట- సూర్య వాస్తవం :** నాయుడుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ నెం. 3/2025-26 సమావేశం మంగళవారం స్థానిక మార్కెట్ యార్డు కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా 2025 నవంబర్, డిసెంబర్ నెలలకు సంబంధించిన మార్కెట్ కమిటీ ఆదాయం, వ్యయాల వివరాలను సెక్రటరీ ప్రసాద్ రెడ్డి కమిటీ సభ్యులకు వివరించారు. ఆదాయ వనరులు, ఖర్చులపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. మార్కెట్ కమిటీ పరిధిలో చేపట్టనున్న అభివృద్ధి పనులపై చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ కమిటీ సభ్యులకు వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం నిర్దేశించిన ఆదాయ లక్ష్యన్ని చేరుకునేందుకు కమిటీ సభ్యులు, అధికారులు సమిష్టిగా కృషి చేయాలని ఆయన కోరారు. మార్కెట్‌కు స్థిరమైన ఆదాయం ఉంటే రైతులకు మరింత మెరుగైన సేవలు అందించవచ్చని ఆయన తెలిపారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో లింకు రోడ్ల నిర్మాణానికి అవసరమైన నిధుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఆయన వెల్లడించారు. రైతుల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. సమావేశం అనంతరం హాజరైన ఏఎంసీ కమిటీ సభ్యులకు గౌరవ భత్యం (చెక్కులు) అందజేశారు. ఈ సమావేశంలో ఏఎంసీ వైస్ చైర్మన్ కిల్లారి గోపాలకృష్ణ (గోపి), ఏ ఎం సి డైరెక్టర్ గోను బాబు పలువురు డైరెక్టర్లు, కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

# ఈ నెల 12న రెవెన్యూ క్లినిక్

**- భూమి రికార్డులు పరిశీలించిన ఆర్డీవో**

**బ్రహ్మంగారిమఠం- సూర్య వాస్తవం :** బ్రహ్మంగారిమఠం తాసిల్దార్ కార్యాలయంలో ఉన్న భూమి మంగళవారం పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 12 న సోమవారం బ్రహ్మంగారిమఠం తహసిల్దార్ కార్యాలయం వద్ద రెవిన్యూ క్లినిక్‌లి ను నిర్వహించనున్నట్లు ఆర్డీవో చంద్రమోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ జాన్సన్ , వీఆర్వోలు , సిబ్బంది తదితరులు ఉన్నారు.




# రాయలసీమకు ద్రోహం చేసిన చంద్రబాబు



**జమ్మలమడుగు సూర్య వాస్తవం:** రాయలసీమను ఏడారి చేసేందుకు ఏపీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు, తెలం గాణ సీఎం రేవంత్ రెడ్డి మధ్య ఉన్న రహస్య ఒప్పందం బట్ట బయలైందని రాయలసీమ రాష్ట్ర సమితి పార్టీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కుంచం వెంకట సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన జమ్మలమడుగు ఆర్అండ్ బి గెస్ట్ హౌస్ లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ సీఎం కోరగానే చంద్రబాబు రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని నిలిపివేశారని, రాయలసీమను దారుణంగా దెబ్బ తీసి మరణశాసనం లిఖించారని మండిపడ్డారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం ఇతర పథకాలపై ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు అఖిల పక్ష సమావేశం నిర్వహించాలని పత్రికా ముఖంగా కోరారు. చంద్రబాబు లాంటి అసమర్థ పరిపాలకున్ని ఇంతవరకు చరిత్రలో చూడలేదన్నారు, ప్రజలను మోసం చేయడానికి సిగ్గులేదా? రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు దొంగలే అని తెలిపారు. తెలంగాణ అసెంబ్లీ సాక్షగా చంద్ర బాబు నిజస్వరూపం బట్టబయలైందనిని, రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చేసిన ప్రకటన అవకాశవాద రాజకీయాలకు నిదర్శనం అన్నారు. చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి సాక్షత్తూ చీకటి మిత్రులు అనే నిజం శాసనసభ సాక్షగా తేలిపోయింది అని ఆరోపించారు. ఆంధ్ర, రాయలసీమ ప్రజలు చంద్రబాబు విధానాలపై, తెలంగాణ చీకటి ఒప్పందాలపై తిరగబడాలని పిలుపు నిచ్చారు. ఈనెల 22 వ తేదీన ఢిల్లీ లో జరిగే ట్రిబ్యునల్ వాదనలో రాయలసీమ వాదన వినిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర ఆర్య వైశ్య నాయకుడు మిట్ట కృష్ణ, రాష్ట్ర మైనార్టీ నాయకుడు పి. సాదర్ వల్లి తదితరులు పాల్గొన్నారు.

# నిరాహార దీక్ష చేయుటకు అనుమతి ఇవ్వండి సర్

**- కాంగ్రెస్, ముస్లిమ్ లీగ్ ప్రజాసంఘాల నాయకుల వినతి**

**రాయచోటి-సూర్య వాస్తవం:** రాయచోటిని ప్రత్యేక జిల్లాగా ప్రకటించాలని కోరుతూ మంగళవారం కాంగ్రెస్, ముస్లిమ్ లిగ్ పార్టీలతో పాటు ప్రజాసంఘాల నేతలు సంయుక్తంగా కలిసి తమ నిరసనలనురాష్ట్రప్రభుత్వానికి తెలియజేయుటకు స్థానిక బంగాళా వద్ద గల కాలేజ్ గ్రౌండ్ నందు సామూహిక నిరాహార దీక్షలు చేపట్టుతున్నామని అనుమతి కోరుతూ స్థానిక అర్బన్ పోలీస్ స్టేషన్ సిఐ చలపతి కు పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆ రాజకీయ పార్టీల శ్రేణులు మాట్లాడుతూ ఎంతో వెనుకబడి ఉన్న మా రాయచోటి మండల కేంద్రాన్ని అన్ని వసతులు కల్పించి గత ప్రభుత్వం జిల్లా కేంద్రంగా మారిస్తే .. కూటమి ప్రభుత్వ మాత్రం ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న రాయచోటి జిల్లా కేంద్రాన్ని ఎత్తిసి మళ్లీ వెనక్కి మండల కేంద్రంగా మార్చడం చాలా బాధాకరమన్నారు. మా ఆవేదన ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లడానికి ఈ సామూహిక నిరాహార దీక్షలు చేపట్టడం జరుగుతుందని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో అమీర్ భాష, షపాబుల్, అజీజుర్ రెహమాన్, జిలాన్, మాసూమ్ వలి, నౌషాద్ తదితరులు పాల్గొన్నారు.



# బెనెకల్ గ్రామంలో శానిటేషన్‌పై అధికారుల ఆకస్మిక తనిఖీ



**కనేకల్–సూర్య వాస్తవం:** కనేకల్ మండలం బెనెకల్ గ్రామంలో శానిటేషన్ కార్యక్రమంపై జిల్లా స్థాయి అధికారులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఐ వి ఆర్ ఎస్ కాల్స్‌లో గ్రామానికి 0శాతం రేటింగ్ రావడంతో స్పందించిన అనంతపురం జిల్లా పరిషత్ సిఈఓ శివశంకర్ మరియు డి డి ఓనాగేశ్వరరావు గ్రామాన్ని మంగళవారం సందర్శించారు.ఈ సందర్భంగా అధికారులు గ్రామ ప్రజలతో నేరుగా మాట్లాడి, శానిటేషన్‌కు సంబంధించిన సమస్యలనుఅడిగితెలుసుకున్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు తక్షణ చర్యలుచేపట్టాలనిపంచాయతీ అభివృద్ధి అధికారి (పిడి ఓ) మరియు సర్పంచ్ కు స్పష్టమైన సూచనలు, ఆదేశాలు జారీచేశారు.గ్రామంలో నియమితుడైన గ్రీన్ అంబాసిడర్ విధులకు హాజరుకావడం లేదని అధికారుల దృష్టికి తీసుకురాగా, వెంటనే ప్రత్యామ్నాయ లేబర్‌ను ఏర్పాటు చేసి గ్రామాన్ని శుభ్రపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని సి ఈ ఓ ఆదేశించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 26 డిసెంబర్ 2025 నుంచి 10 జనవరి 2026 వరకు శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌ను అమలు చేస్తున్న నేపథ్యంలో, ప్రతి గ్రామంలో శుభ్రతా కార్యక్రమాలు క్రమబద్ధంగా నిర్వహించాలని అధికారులు ఈ సందర్భంగా తెలిపారు.ఈ గ్రామ సందర్శన కార్యక్రమంలో వి. విజయ సింహా రెడ్డి,ఎంపిడిఓకనేకల్, చంద్రమౌళి డిప్యూటీ ఎంపిడిఓ , తదితరఅధికారులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నేడు రాయచోటి జిల్లా కేంద్ర అంశంపై హైకోర్టులో వాదనలు

## - వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి



**కడప/అన్నమయ్య బ్యూరో –సూర్య వాస్తవం:** రాయచోటిని జిల్లా కేంద్రంగా యథతథంగా కొనసాగించాలనే అంశంపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) హైకోర్టులో రేపు బుధవారం వాదనలు జరగనున్నాయని వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఈ కేసును ఇటీవలే హైకోర్టు స్వీకరించిందని, రేపు బుధవారం జరగనున్న వాదనలకు 7వ నంబరింగ్ పొందిందన్నారు. ఈ అంశంపై ఖచ్చితంగా న్యాయం జరుగుతుందని దేవుణ్ణి ప్రార్థిస్తున్నామని ఆయన అన్నారు.రాయచోటి నియోజకవర్గ ప్రజల ఆందోళనలు న్యాయస్థానం ద్వారా పరిష్కారం పొంది, ప్రజలకు మేలు జరుగుతుందనే ఆశాభావాన్ని శ్రీకాంత్ రెడ్డి వ్యక్తం చేశారు.

# యుపిహెచ్ సి పి హెచ్ సిలలో ఆశా డే

**పులివెందుల–సూర్య వాస్తవం:** కడప జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నుంచి డిప్యూటీ డెమో ప్రసన్నలత కోరుకుంటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, నగరి గుట్ట యు పీహెచ్ సి నందు ఆషా డే మీటింగ్ సందర్భంగా ఫుల్ ఇమ్యూనైజషన్, విటమిన్ ఏ సప్లిమెంటేషన్, గవర్నమెంట్ హాస్పిటల్ డెలివరీస్, మానేజ్మెంట్ హైరిస్క్ ప్రెగ్నెన్సీస్, ఈ ఆశాయాప్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో చంటి బిడ్డలకు డ్యూ డేట్ ప్రకారం టీకాలు వేసినట్లయితే 13 ప్రాణాంతక వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. అలాగే ఆశలు మాత శిశు సంరక్షణలో తప్పక భాగస్వాములు కావాలన్నారు. ప్రతి ఈసీని ఇంటింటిలో సర్వే చేసి అన్ని సేవలు అందించాలన్నారు. హెక్బియస్సీ,హెక్బివైసి సేవలు అందించాలన్నారు. ఎన్ సి డి 4.0 సర్వే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు క్వాలిటీగా చేసి సస్పెక్ట్ కేసులకు మెడికల్ ఆఫీసర్ దగ్గర చూయించి పాజిటివ్ వస్తే వెంటనే చికిత్స ఇప్పించాలని తెలిపారు. అలాగే అన్ని కేసులను ఫాలోఅప్ చేయాలన్నారు. మూడు సంవత్సరాల లోపల పిల్లలకు 4 డీలపై క్షుణ్ణంగా పరిశీలించి డాక్టర్ దగ్గరికి రెఫర్ చేయాలన్నారు. ఆర్ సి హెచ్ టు నందు అన్ని రకాల అప్డేట్స్ ఉన్నందున ప్రతి ఒక్కరు ఈ యాప్ ను డౌన్లోడ్ చేసుకొని చేయాలన్నారు. అలాగే అందరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ పరిసరాల పరిశుభ్రతతో అంటువ్యాధుల నుండి తప్పించుకోవచ్చని. తెలిపారు. ఆశ యాప్ ను ప్రతిరోజు అప్డేట్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక డాక్టర్లు, స్రవంతి, స్నేహప్రతుషా, ఖాధర్ భాషా ఏఎన్ఎంలు,ఆశాలు పాల్గొన్నారు.



# ఫ్లెమింగో పండుగకు ఘన ఆహ్వానం

- సూళ్లూరుపేటలో విద్యార్థులతో జోరుగా ర్యాలీ
- ఫ్లెమింగో ఫెస్టివల్‌ఉ2026కు పట్టణం ఉత్సవ వాతావరణం
- అవగాహన ర్యాలీ పాల్గొన్న - ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ



**పెళ్లకూరు –సూర్య వాస్తవం :**సూళ్లూరుపేటలో నిర్వహించనున్న ఫ్లెమింగో ఫెస్టివల్‌ఉ2026కు ఆహ్వానం పలుకుతూ విద్యార్థులతో కలిసి నిర్వహించిన భారీ ర్యాలీ పట్టణాన్ని సందడిగా మార్చింది. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట శాసనసభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.తిరుపతి జిల్లా విద్యాశాఖ డీఈఓ. వి.ఎన్. కుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ర్యాలీ పట్టణ ప్రధాన వీధుల గుండా ఉత్సాహంగా కొనసాగింది. పాఠశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఫ్లెమింగో పక్షుల సంరక్షణ, పర్యాటక ప్రాముఖ్యతపై నినాదాలు చేస్తూ ఆకట్టుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ సంరక్షణ అధికారి సెల్వం, ట్రైనింగ్ కలెక్టర్ రఘువంశీ, పర్యాటక శాఖ అధికారి రమణ ప్రసాద్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మాట్లాడుతూ....**

"గత సంవత్సరాల మాదిరిగానే ఈ ఏడాది కూడా ఫ్లెమింగో పక్షుల పండుగను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఇది మన ప్రాంత పర్యాటక అభివృద్ధికి దోహదపడే ముఖ్యమైన వేడుక" అని తెలిపారు.జనవరి 10, 11 తేదీల్లో జరగనున్న ఫ్లెమింగో ఫెస్టివల్‌లో విద్యార్థులు, పక్షుల ప్రేమికులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఫ్లెమింగో పండుగ ద్వారా సూళ్లూరుపేట ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని, ప్రకృతి సంరక్షణతో పాటు పర్యాటక రంగం మరింత అభివృద్ధి చెందుతుందని అధికారులు పేర్కొన్నారు.





## పేద ఖైదీలకు

# సహాయ పథకం మరింత అమలు చేయాలి

- జిల్లా స్థాయి సాధికార కమిటీ సమావేశంలో.. జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్



**శ్రీ సత్య సాయి జిల్లా బ్యూరో –సూర్య వాస్తవం :** పేద ఖైదీలు ఆర్థిక ఇబ్బందుల కారణంగా జైల్లోనే ఉండిపోకుండా న్యాయం అందించాలనే లక్ష్యంతో 'పేద ఖైదీలకు సహాయం' పథకం అమలును మరింత ప్రభావవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు.
మంగళవారం స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో, జిల్లా న్యాయ సేవల ప్రాధికార సంస్థ కార్యదర్శి ఎన్.రాజశేఖర్ ఆధ్వర్యంలో... జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి సాధికార కమిటీ సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవల ప్రాధికార సంస్థ కార్యదర్శి ఎన్.రాజశేఖర్ కలెక్టర్ మాట్లాడుతూ... డిఎల్ఎస్ఏ సిఫారసుల మేరకు నివేదిక అందిన తేదీ నుంచి ఐదు రోజులలోపు జామీనుకు సంబంధించిన నిధుల విడుదలకు జిల్లా స్థాయి సాధికార కమిటీ ఆదేశాలు జారీ చేయాలని వివరించారు. మార్గదర్శకాలు అనుసరించి అన్ని అర్హత కలిగిన కేసులను డిఎల్ఎస్ఏ కార్యదర్శి జిల్లా స్థాయి సాధికార కమిటీ ముందు ఉంచడం జరుగుతుందన్నారు. ప్రతి నెల మొదటి , మూడవ సోమవారం ఆ రోజులు సెలవు అయితే తదుపరి పని దినంలో సాధికార కమిటీ సమావేశమై, డిఎల్ఎస్ఏ సిఫారసు చేసిన కేసులను పరిశీలించాలని తెలిపారు. పరిశీలన అనంతరం, విచారణలో ఉన్న పేద ఖైదీకి 'పేద ఖైదీలకు సహాయం' పథకం కింద ఆర్థిక సహాయం అవసరమని కమిటీ సిఫారసు చేస్తే, ఒక్కో ఖైదీకి గరిష్ఠంగా రూ.50వేల వరకు అవసరమైన మొత్తాన్ని కమిటీ నిర్ణయం తీసుకున్న తేదీ నుంచి ఐదు రోజులలోపు ఫిక్స్ డిపాజిట్ లేదా ఇతర తగిన విధానంలో గౌరవనీయ న్యాయస్థానానికి అందుబాటులో ఉంచేలా ఆదేశించవచ్చని తెలిపారు. ఈ నిర్ణయాన్ని అదే సమయంలో ఈమెయిల్ ద్వారా డిఎల్ఎస్ఏ, జైలు అధికారులకు తెలియజేయాలన్నారు. ఏదైనా కారణంగా ఐదు రోజుల లోపు కోర్టులో నిధులు జమ కాకపోతే, ఖైదీ విడుదల జరగకపోతే, ఆరవ రోజున జైలు అధికారులు ఈ విషయాన్ని డిఎల్ఎస్ఏ కు తెలియ జేయాలని స్పష్టం చేశారు. అదేవిధంగా, జరిమానా మొత్తాన్ని చెల్లించలేక దోషిగా తేలిన వ్యక్తి జైలు నుంచి విడుదల కాకపోతే, సంబంధిత జైలు సూపరింటెండెంట్ ఏడు రోజుల లోపు డిఎల్ఎస్ఏ కార్యదర్శికి సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... ఖైదీ ఆర్థిక స్థితిగతులను జైలు సందర్శక న్యాయవాది, పారా లీగల్ వాలంటీర్, జిల్లా ప్రొబేషన్ అధికారి తదితరుల సహకారంతో ఏడు రోజుల లోపు పరిశీలించాలని సూచించారు. మార్గదర్శకాలు నిబంధనల మేరకు ఖైదీ విడుదల కోసం కోర్టులో జమ చేయాల్సిన జరిమానా మొత్తంగా రూ.25వేల వరకు సాధికార కమిటీ మంజూరు చేయవచ్చని, ఆ మొత్తానికి మించిన ప్రతిపాదనలకు పర్యవేక్షణ కమిటీ ఆమోదం అవసరమని తెలిపారు. ఇటువంటి అర్హత గల కేసులను గుర్తించేందుకు జిల్లాలోని అన్ని జైళ్ల డిప్యూటీ సూపరింటెండెంట్లకు తగిన ఆదేశాలు జారీ చేయాలని, పేద ఖైదీలకు సహాయం' పథకం అమలును జిల్లాలో మరింత ప్రభావవంతంగా అమలు చేసేందుకు కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో సబ్ జైల్ అధికారులు ఉమామహేశ్వర నాయుడు, శివరామకృష్ణ, హనుమప్ప ఏ.హుస్సేన్, డిఆర్డిఏ పిడి నరసయ్య, డిఎల్ఎస్ఏ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ముస్లింలు రాజకీయ నాయకత్వం వైపు అడుగులు వేయాలి

- ముస్లిం సమాజం ఐక్యమత్యంగా ఉండాలి
- రాయదుర్గం మైనారిటీ సెల్ నాయకులు బి ఎమ్ నాదే ఆలి



**కనేకల్–సూర్యవాస్తవం:** రాయదుర్గం మైనారిటీ నాయకులు బి ఎం నాదల్ రాయదుర్గంలో ప్రత్యేకంగా విలేకరులతో మాట్లాడుతూ ముస్లింలు నాయకత్వం వైపు అడుగులు వేయాలని తద్వారా ముస్లింలకు రావాల్సిన హక్కులను సాధించగలిగే స్తోమత అర్హత, దమాషా ప్రకారం చట్టసభల్లో వెళ్లడానికి దారులు ఏర్పడుతాయని ఆయన పేర్కొన్నారు. మరి ముఖ్యంగా సచ్చార్, శ్రీకృష్ణ, రంగనాథ్ మిశ్రా కమిటీలు వెలువరించిన సూచనలు తీసుకుని ముస్లిం సమాజం ముందుకు అడుగు వేయాలని తద్వారా చదువు పరంగా, రాజకీయంగా, ఆర్థికంగా సామాజికంగా ముస్లిం సమాజం అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు. దేశంలో అణగారిన వర్గాల కంటే కూడా ముస్లిం సమాజం వెనుకబడి ఉందని మరి ముఖ్యంగా చదువు పరంగా ముస్లిం యువత వెనకబడి ఉన్నారని ఆయన తెలియజేశారు. ముస్లింలలో నాయకత్వ లోపం చదువుపరంగా అధిగమించవచ్చని ఆయన అన్నారు. ప్రతి ముస్లిం చదువుకుంటే మిగతా రాజకీయ ఆర్థిక లక్షల పైచిలుకు నాలుగు జిల్లాలు 32 నియోజకవర్గాల్లో ముస్లింల ప్రబల్యం ఎక్కువగా ఉందని ఆయన తెలియజేశారు. మరి ముఖ్యంగా కొన్ని కట్టుబాట్ల వల్ల ముస్లిం సమాజం వెనుకబడిందని ఇప్పుడు ఇప్పుడే ఆకట్టుబాట్లు నుంచి బయటకి వచ్చి నాయకత్వం పై అడుగులు పడుతున్నాయని ఆయన అన్నారు. ఇస్లాం మతానికి సంబంధించి ఎవరైనా చులకనగా మాట్లాడితే హేళన చేస్తే గళం విప్పే ముస్లింలు హక్కుల విషయానికి దగ్గర వస్తేనోళ్లు మూసుకోబోతున్నాయని ఆయన అన్నారు. ముఖ్యంగా ముస్లింలలో మహిళలు నెట్టుకు రావడం చాలా కష్టమని ఎప్పుడైతే ముస్లిం మహిళలు చదువు పరంగా, వ్యాపార పరంగా,రాజకీయంగా రాణిస్తారు ఆనాడే ముస్లిం సమాజం సగం అభివృద్ధి చెందినట్లు అని ముస్లిం సమాజం ఐక్యత మత్యంతో ఉన్నప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయని బి ఎం నాదల్ విలేకరులతో తెలిపారు.

## హెల్మెట్ ధరించండి..

# ప్రాణాలను కాపాడుకోండి

- అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి
- రాయచోటి పట్టణంలో ఎస్పీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ
- 37వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలకు ఘనంగా శ్రీకారం
- నో హెల్మెట్ - నో ఫ్యూయల్ నిబంధన అమలుకు సన్నాహాలు



**కడప/అన్నమయ్య బ్యూరో- సూర్య వాస్తవం:** రోడ్డు భద్రత అనేది కేవలం ఒక నిబంధన కాదు, అది ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నమయ్య జిల్లా ఎస్పీ శ్రీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ పేర్కొన్నారు 37వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా (జనవరి 01 నుండి 31 వరకు), మంగళవారం రాయచోటి పట్టణంలో హెల్మెట్ ధారణ ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ జిల్లా ఎస్పీ గారు స్వయంగా హెల్మెట్ ధరించి భారీ బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీ కడప రింగ్ రోడ్ వద్ద ప్రారంభమై, శివాలయం చెక్ పోస్ట్ మీదుగా బంగ్లా వరకు ఉత్సాహంగా సాగింది. పోలీసు అధికారులు, సిబ్బంది, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు, విద్యా సంస్థల ప్రతినిధులు మరియు పట్టణ బైక్ మెకానిక్స్ పెద్ద సంఖ్యలో పాల్గొని రోడ్డు భద్రతా నినాదాలతో ప్రజల్లో చైతన్యం నింపారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ద్విచక్ర వాహన ప్రమాదాల్లో జరిగే మరణాలలో అధిక



శాతం తలకు గాయాలు కావడం వల్లే జరుగుతున్నాయి. ఐఎస్ఐ ముద్ర కలిగిన హెల్మెట్ ధరిస్తే ప్రాణాపాయం నుండి 80శాతం పైగా తప్పించుకోవచ్చు. అతివేగం ఆపదకు మూలమని, యువత అత్యుత్సాహంతో బైక్ రేసింగ్‌లు చేసి విలువైన ప్రాణాలను బలి తీసుకోవద్దని కోరారు. మద్యం సేవించి వాహనం నడపడం, డ్రైవింగ్ చేస్తూ సెల్ ఫోన్ మాట్లాడటం చట్టరీత్యా నేరమని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో ప్రమాదాల నివారణకు గాను, హెల్మెట్ ధరించని వాహనదారులకు పెట్రోల్ బంకుల్లో ఇంధనం నింపకూడదనే నిబంధనను కచ్చితంగా అమలు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) శ్రీ యం. వెంకటాద్రి రాయచోటి డిఎస్పీ యం.ఆర్. కృష్ణమోహన్ , ట్రాఫిక్ సి.ఐ. కులాయప్ప, రాయచోటి పట్టణ మరియు రూరల్ సి.ఐలు చలపతి, రోషన్, లక్కిరెడ్డిపల్లి సి.ఐ. కృష్ణంరాజు నాయక్, ఎం.వి.ఐ. సుబ్బరాయుడు, పలువురు ఎస్.ఐలు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసు వారికి సహకరించాలని, రోడ్డు ప్రమాద రహిత జిల్లాగా అన్నమయ్య జిల్లాను తీర్చిదిద్దాలని ఎస్పీ పిలుపునిచ్చారు.

## డిసిసి బ్యాంక్ ఎదుట

# రెండవ రోజు రిలే నిరాహార దీక్ష

- పాల్గొన్న సహకార సంఘ ఉద్యోగులు



**కడప/అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం:**
**కడప/అన్నమయ్య బ్యూరో- సూర్య వాస్తవం:** సహకార సంఘ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సహకార ఉద్యోగుల సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షులు సీవీ సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార సంఘాల ఉద్యోగస్తుల యూనియన్ల ఐక్యవేదిక పిలుపుమేరకు ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా సహకార సంఘాల ఉద్యోగస్తుల డిమాండ్ల సాధన కోసం రాష్ట్రంలోని అన్ని సహకార సంఘాల ఉద్యోగస్తులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఇందులో భాగంగా అన్నమయ్య జిల్లా సహకార సంఘాల ఉద్యోగస్తులు మంగళవారము రాయచోటి పట్టణంలోని డిసిసి బ్యాంక్ ఎదుట రెండవ రోజు రిలే నిరాహార దీక్ష కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగస్తుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని గత నెల రోజులుగా జరుగుతున్న ఈ ఆందోళన కార్యక్రమాలను కమిషనర్ పట్టించుకోకుండా సహకార సంఘాల మీద ఉన్న అక్కసుతో సహకార సంఘాల ఉద్యోగస్తుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుళ్లకుండా అడ్డు పడుతున్నారని ఆరోపించారు.2019 తర్వాత సహకార సంఘాలలో పనిచేస్తున్న ఉద్యోగస్తులను పర్మినెంట్ చేయాలని, రిటైర్మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ 10 లక్షల పెంచాలని,సహకార సంఘాల ఉద్యోగస్తులకు డిఎల్ఎస్ఎఫ్ ఫండ్ ఏర్పాటుచేసి దాని ద్వారా జీతాలు చెల్లించాలన్నారు. లేని పక్షంలో ఆమరణ నిరాహార దీక్షకు కూడా వెనుకాడబోమని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ రిలే నిరాహార దీక్షలకు మద్దతుగా తెలుగుదేశం పార్టీ 12వ వార్డ్ ఇంచార్జి వీ రామ్మోహన్ రెడ్డి , కాంట్రాక్టర్ ఆంజనేయులు తెలుగుదేశం పార్టీ నాయకుడు షేక్ జాఫర్ సంఘీభావం తెలిపారు.అలాగే కో- ఆపరేటివ్ అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షుడు వీ ప్రకాష్, కో-ఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్స్ టి మధుగారు మరియు సురేష్ రిలే నిరాహార దీక్షకు విచ్చేసి సంఘీభావం తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుప్పం రెడ్డి బాబు అన్నమయ్య జిల్లా సహకార సంఘం ,రాష్ట్ర నాయకులు సాబ్జాన్, ఆంజనేయరెడ్డి, జాఫర్, రెడ్డెప్పరెడ్డి, లక్ష్మనారాయణ, హరి, సహకార సంఘాల సీఈఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

## మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో

# ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

- సిబ్బంది కొరతపై పూర్తిస్థాయి నివేదిక సమర్పించాలని ఆదేశాలు జారీ చేసిన జిల్లా కలెక్టర్

**కడప/అన్నమయ్య బ్యూరో- సూర్య వాస్తవం:** మదనపల్లి పట్టణంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మంగళవారం ఉదయం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రభుత్వ ఆసుపత్రికి సంబంధించిన ఓపి రిజిస్ట్రేషన్, ఇన్ పేషంట్ రిజిస్ట్రేషన్ రిజిస్టర్‌లను, రిజిస్ట్రేషన్ ప్రక్రియను, తనిఖీ చేసి పలు అంశాలను ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను అడగగా సంబంధిత సమాధానాలను ఆసుపత్రి సూపరిం టెండెంట్ రమేష్.. కలెక్టర్కు వివరించారు. ఆసుపత్రిలోని ఓపి గదులను, ఇన్ పేషెంట్ గదులను, ఐసీయూ వార్డును, తనిఖీ చేసి ఆసుపత్రి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు. ఆసుపత్రిలోని అన్ని వార్డులు సక్రమంగా పనిచేయాలని సిబ్బందిని ఆదేశించారు.

ఆసుపత్రిలోని మందుల స్టోరేజ్ గదిని తనిఖీ చేసి ఏ ఏ రకాల మందులు వస్తున్నాయి ఏ విధంగా స్టోర్ చేస్తున్నారు, ఆన్లైన్లో ఏ విధంగా వివరాలు పొందపరుస్తున్నారు, తదితర అంశాలను అక్కడ సిబ్బందిని అడిగారు. ఆసుపత్రికి వచ్చే మందుల వివరాలను ఈ-ఔషధీ వెబ్సైట్లో నమోదు చేసే విధంగా చర్యలు చేపట్టాలని



ఆదేశించారు. ఆసుపత్రిలోని గైనిక్ వార్డును తనిఖీ చేసి అక్కడ చికిత్స పొందుతున్న వారిని డాక్టర్లు సమయానికి వస్తున్నారా సమయానికి మందులు ఇస్తున్నారా ఎటువంటి భోజనం పెడుతున్నారు వంటి పలు ప్రశ్నలు అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆరోగ్యశ్రీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ, సిటి స్కాన్, ఎంఆర్ఐ తదితర మెడికల్ పరికరాలు అందుబాటులో ఉన్నాయా లేదా అని ఆసుపత్రి సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆరోగ్యశ్రీ ప్రక్రియ వేగవంతంగా ఉండాలని చికిత్స కోసం వచ్చే వారికి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం.. పుట్టిన పిల్లలకు కేటాయించిన సంరక్షణ విభాగాన్ని తనిఖీ చేసి అక్కడ సిబ్బందికి తగు సూచనలు చేశారు. మెడికల్ ఆక్సిజన్ ప్లాంటును తనిఖీ చేసి ప్లాంట్ పాసిటీ ఎంత ఎన్ని రోజులకు వినియోగించు కోవ చ్చు ఇటీవల పూర్తిస్థాయిలో ఆక్సిజన్ ఎప్పుడు నింపబడింది తదితర అంశాలను ఆసుపత్రి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.ఆసుపత్రిలో పనిచేస్తున్న సిబ్బంది వివరాలు, సిబ్బంది కొరత, జనరల్ మెడిసిన్, డెర్మటాలజీ, సైకియాట్రి, అనస్థీషియా తదితర విభాగాలకు డాక్టర్లు ఉన్నారా లేదా అని అడిగి, సిబ్బంది కొరతపై పూర్తిస్థాయి నివేదికను సమర్పించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఆసుపత్రికి అవస రమయ్యే మెడికల్ పరికరాలు తదితర అంశాలపై నివేదికను సమర్పించాలని ఆదేశించారు.



## వాహన డ్రైవర్లకు ఉచిత వైద్య పరీక్షలు





**వేంపల్లె - సూర్య వాస్తవం:** మంగళవారం వేంపల్లిలో ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు రోడ్డు భద్రతా మాసం సందర్భంగా డ్రైవర్ల ఆరోగ్య పరిరక్షణ, రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా వేంపల్లి పట్టణంలో వేంపల్లి సి.ఐ నరసింహులు ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాహనదారులకు రక్తపోటు, షుగర్, కంటి పరీక్షలు తదితర ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించారు. హెవీ గూడ్స్ వెహికల్స్, మీడియం గూడ్స్ వెహికల్స్, ఆటో డ్రైవర్లకు ఈ వైద్య పరీక్షలు నిర్వహించారు. వయసు పై బడే కొద్దీ దూరదృష్టి లోపించడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువ శాతం ఉంటాయని, కంటి సమస్యలను ముందుగానే గుర్తించి చికిత్స తీసుకుంటే ప్రమాదాలను నివారించవచ్చని వేంపల్లి సి.ఐ నరసింహులు సూచించారు. అలాగే ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ, వాహనాలు నడిపేటప్పుడు శారీరక స్థితి ఎంత ముఖ్యమో వేంపల్లి సి.ఐ నరసింహులు వివరించారు. వైద్యులు డా. రామమోహన్ రెడ్డి, డా. షరీఫ్ డ్రైవర్లకు వైద్యసేవలు అందించారు. వైద్యులకు వేంపల్లి సి.ఐ నరసింహులు పోలీస్ శాఖ తరపున కృతజ్ఞతలు తెలిపారు. రహదారి భద్రతకు డ్రైవర్ల ఆరోగ్యం కీలకమని, జిల్లా ఎస్.పి ఆదేశాల మేరకు ఇలాంటి కార్యక్రమాలు మున్ముందు మరిన్ని నిర్వహించడం జరుగుతుందని వేంపల్లి సి.ఐ నరసింహులు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా సురక్షిత డ్రైవింగ్‌కు డ్రైవర్లను ప్రోత్సహించడం జరిగింది. కార్యక్రమం లో భాగంగా ట్రాఫిక్ నిబంధనలపై వేంపల్లి సి.ఐ నరసింహులు అవగాహన కల్పించారు. వాహన డ్రైవర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆలిండియా ఫెడరేషన్ కప్ పోటీలలో కాంస్య పతకం



**వేంపల్లె - సూర్య వాస్తవం:** తమిళనాడులోని తిరుచి వేదికగా ఇంద్ర గణేషన్ ఇన్స్టిట్యూషన్స్‌లో జరిగిన ఆలిండియా ఫెడరేషన్ కప్ పోటీలలో, వైయస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తృతీయ సంవత్సరం కంప్యూటర్ సైన్స్ చదువుతున్న విద్యార్థిని,మానస ఆంధ్రప్రదేశ్ మహిళల గోల్ షాట్ బాల్ జట్టులో పాల్గొనిందని కళాశాల ప్రిన్సిపల్ నాగేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్ తేజేంద్ర మాట్లాడుతూ గత నెల 24 వ తేదీ 28 వ తేదీ వరకు జరిగిన ఆల్ ఇండియా ఫెడరేషన్ కప్ ఛాంపియన్‌షిప్‌లు ఆంధ్రప్రదేశ్ మహిళల జట్టు మూడవ స్థానంలో నిలిచి, కాంక్ష పథకం సాధించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ బాలకొండ గంగాధర్, వైస్ ప్రిన్సిపాల్ సతీష్, డాక్టర్ సుధాకర్, డాక్టర్ మాధవరావు, డాక్టర్ నాగలక్ష్మ దేవి, డాక్టర్ ఓబుల్ రెడ్డి,షఫీవుద్దీన్ ,కిరణ్ మై, అరవింద్, రాజారెడ్డి, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.

## లూయీ బ్రయిలీ 164వ వర్ధంతి

**పులివెందుల- సూర్య వాస్తవం:** పులివెందుల పట్టణం కచేరీ రోడ్ గీత మందిరం పక్కన ఉన్న శ్రీవీర నారాయణా స్వామి అంధుల ఆశ్రమంలో ముఖ్య అతిథిగా డి.ఎస్.పి మురళి నాయక్ లూయీ బ్రెయిలీ చిత్రపటం పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. మురళి నాయక్ మాట్లాడుతూ చూపు లేని వారికి దేవుడు మానవ రూపమున లూయీ అని తెలిపారు. తోటి అంధ స్నేహితులు వారికి ఏబిసిడి నేను, ఎమ్ కామ్ చదువుతున్న సమయంలో పాటాలు చదివి వినిపించేవారిని. అంధ స్నేహితులు నా కంటే ఎక్కువ మార్కులు సంపాదించేవారు. నేను గ్రహించింది అంధులు జ్ఞాపక శక్తిని ఎక్కవ అని తోటి అంధులు చుక్కల లిపి ఎంతో మందికి వెలుగు దీపం శ్రీ వీర నారాయణ స్వామి అంధుల ఆశ్రమం దినసర నిత్యావసర సరుకులకు ఆర్థిక సహాయం అందజేశారు. పండ్లు, బ్రెడ్స్ పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో వి.లక్ష్మ నారాయణా, ప్రవీణ్ కుమార్ సబ్ ఇన్స్పెక్టర్, వేముల , తాడిమర్రి ప్రకాష్ రావు. యు సి ఐ ఎల్ సబ్ ఇన్‌స్పెక్టర్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, కొండ రెడ్డి, ముక్కోటి శేషయ్య, వెంకట మహేశ్వరి అంధులు, వృద్ధులు ఆశ్రమం నిర్వహకులు అనిమేల రామ మోహన్ పాల్గొన్నారు.



## ఘనంగా సద్గురు త్యాగరాజ స్వామి ఆరాధన మహోత్సవం

**- నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు వివి రత్నం**



**వేంపల్లి - సూర్య వాస్తవం:** పట్టణంలోని గాండ్ల వీధిలో వెలసిన శ్రీ శ్రీ శ్రీ సద్గురు త్యాగరాజ స్వామి ఆరాధన మహోత్సవం వేద మంత్రాలు మంగళ వాయిద్యాలు మధ్య, నాయి బ్రాహ్మణ కుటుంబ సభ్యులందరి సమక్షంలో స్వామివారి ఆరాధన మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించినట్లు నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు వివి రత్నం స్వామివారి అభిషేకము స్వామి వారికి కీర్తనలతో మంగళ వాయిద్యాలతో గుడి చుట్టూ ప్రదక్షణాలు చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమం అనంతరం నాయి బ్రాహ్మణ సేవా సంఘం యూత్ గౌరవాధ్యక్షుడు సిద్దయ్య, మోపురి రమేష్ బాబు అధ్యక్షతన భోజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ కార్య క్రమంలో నాయి బ్రాహ్మణ సేవా సంఘం గౌరవాధ్యక్షుడు డాక్టర్ సుబ్రమణ్యం, కార్యదర్శి గంగాధర, కే.హరి, టి మణికంఠ, పీరయ్య, చంద్రబాబు, గండికోట వెంకట శివ, చంద్రాయుడు, యువజన సంఘ అధ్యక్షుడు ప్రదీప్, ఆర్ పెద్ద రామాంజనేయులు మరియు నాయీ బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ఆక్రమణల తొలగింపుపై చర్యలు

**- హెచ్ఎం శ్రీనివాసులరెడ్డి**



**వేంపల్లి - సూర్య వాస్తవం:** స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ముందు ఆక్రమణల తొలగింపుపై చర్యలు చేపట్టినట్లు హెచ్ఎం శ్రీనివాసులరెడ్డి అన్నారు. మంగళవారం ఆ పాఠశాల ముందు జేసిబి ద్వారా ఆ ప్రాంతాన్ని చదును చేశారు. ఆ ప్రాంతంలో మొక్కలు నాటి ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొల్పెందుకు కృషి చేస్తామని, పాఠశాల ఆవరణం ముందు చెత్తాచెదారాన్ని వేయరాదని విజ్ఞప్తి చేశారు. అందుకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయ కుడు డక్కా రమేష్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతుల పక్షపాతి ముఖ్యమంత్రి చంద్రబాబు

**- కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభించిన డిసిఎంఎస్ ఛైర్మన్ నాగేశ్వరయ్య యాదవ్, ఆలూరి ఇన్‌ఛార్జి వైకుంఠం జ్యోతి**



**కర్నూల్ -సూర్య వాస్తవం:** ఆలూరు నియోజకవర్గం హాలహర్వి మండలంలో డీసీ ఎంస్ కందుల కొనుగోలు కేంద్రంను ప్రారంభించిన డీసీఎంస్ ఛైర్మన్ వై.నాగేశ్వర్ రావు యాదవ్ ఆలూరు టిడిపి ఇన్‌చార్జీ వైకుంఠం జ్యోతి. ఈ సందర్భంగా డీసీఎంస్ ఛైర్మన్ వై.నాగేశ్వర్ రావు యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో నిసీసీఫ్, మార్కుఫెడ్ వారి ద్వారా డీసీఎంస్ కొనుగోలు కేంద్రం మొదలు పెట్టామని రైతు సోదరులు ఈ అవకాశాన్ని సద్విని యో గం చేసుకోవాలని కందులు 8 వేలు ప్రభుత్వ మద్దతు ధరకు అమ్మమని దళారుల చేతిలో మోస పోకండన్నారు. ఈ సందర్భంగా ఆలూరు టిడిపి ఇంచార్జీ శ్రీమతి వైకుంఠం జ్యోతి మాట్లాడుతూ డీసీఎంస్ ఛైర్మన్ నాగేశ్వర్ రావు యాదవ్ ఆధ్వర్యంలో చేపట్టిన కొనుగోలు కేంద్రం ఆలూరు నియోజకవర్గం హాలహర్వి మండలంలో మొదలు పెట్టడం చాలా సంతోషకరమని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కుఫెడ్ మేనేజర్ రాజు, డీసీఎంస్ మేనేజర్ రాజేష్,అగ్రికల్చర్ ఆఫీసర్, టిడిపి మండల అధ్యక్షులు, ఆలూరు మార్కెట్ యార్డ్ ఛైర్మన్ వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు




# జీవో 85ను రద్దు చేయాలి

**- ప్రాథమిక విద్యలో తెలుగు మాధ్యమాన్ని తప్పనిసరి చేయాలి**
**- తెలుగు మాధ్యమంలో చదివిన వారికి రెండు శాతం అదనపు మార్కులు కలపాలి**
**- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి**



**వేంపల్లి - సూర్య వాస్తవం:** తెలుగు భాష పరిరక్షంప బడాలంటే జీవో 85 రద్దు చేయాలి, ప్రాథమిక విద్యలో తెలుగు మాధ్యమాన్ని తప్పనిసరి చేయాలి, తెలుగు మాధ్యమంలో చదివిన వారికి రెండు శాతం అదనపు మార్పులు కలపాలి అని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డీ తులసి రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం వేంపల్లి లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం తెలుగు భాష పరిరక్షణ విషయంలో ద్వంద ప్రమాణాలు పాటిస్తున్నదని అన్నారు. పైకి చెబుతున్నది ఒకటి, చేస్తున్నది వేరొకటి అన్నారు. గోటితో గిల్లుతూ నోటితో లాలిపాట పాడినట్లు ఉంది అన్నారు. అమ్మ భాష మరవద్దు, మాతృభాష మన మూలం, అమ్మ భాషతోనే అభివృద్ధి, భాషాభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తా అని సోమవారం ప్రపంచ తెలుగు మహాసభలో ముఖ్యమంత్రి చెప్పడం హర్షనీయం. కానీ ఆచరణలో ఆ విధంగా లేదు. పాఠశాల విద్యలో తెలుగు మాధ్యమాన్ని రద్దు చేస్తూ, దాని స్థానంలో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెడుతూ వైకాపా ప్రభుత్వం 2019 నవంబర్ 20న జీవో 85 జారీ చేసింది. ఈ జీవో తెలుగు భాషకు తీరని ద్రోహం చేసింది.ప్రస్తుతం చంద్రబాబు పాలనలో కూడా ఆ జీవో కొనసాగుతూ ఉంది. ఈ సంవత్సరం మార్చిలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 94 శాతం మంది విద్యార్థులు ఆంగ్ల మాధ్య మంలో పరీక్షలు రాయబోతున్నారు. దీనిని బట్టి తెలుగు భాష ఎటువంటి దుస్థితిలో ఉందో అర్థమవుతుంది. తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్లో, తెలుగుదేశం పార్టీ పాలనలో తెలుగు భాషకు ఈ దుస్థితి పట్టడం అత్యంత సోచనీయం. తెలుగుదేశం వ్యవ స్థాపకులు స్వర్గీయ ఎన్టీ రామారావు పట్ల ఏమాత్రం గౌరవం ఉన్నా,తెలుగు భాష పట్ల ఏమాత్రం అభిమానం ఉన్నా జగన్ పాలనలో తెలుగు భాషకు ఉరిత్రాడుగా జారి అయిన జీవో 85ను రద్దు చేయాలని ప్రాథమిక విద్యలో తెలుగు మాధ్యమాన్ని అటు ప్రభుత్వ పాఠశాలల్లో,ఇటు ప్రైవేట్ పాఠశాలల్లో తప్పనిసరి చేయాలని,తెలుగు మాధ్యమంలో చదివిన విద్యార్థులకు ఉన్నత విద్య ప్రవేశాలలో,ఉద్యోగ నియామకాలలో రెండు శాతం అదనపు మార్కులు కలపాలని తులసి రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మీడియా సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ సుబ్రహ్మణ్యం,ప్రసాద్ గౌడ్, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి సుబ్బారెడ్డి,వేంపల్లి మండల శాఖ అధ్యక్షులు రామకృష్ణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి ఉత్తన్న తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి బండారు వెంకటేశు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# యువతకు ఆదర్శం నిసార్ యాసిన్ ఖాన్

**- యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఘన సన్మానం**

**కదిరి - సూర్య వాస్తవం:** కదిరి పట్టణంలోని సిమ్స్ హాస్పిటల్ ఎండి నిస్సార్ యాసిన్ ఖాన్ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని యుటిఎఫ్ నాయకులు పేర్కొన్నారు. నిస్సార్ చేస్తున్న సేవా కార్యక్రమాల సందర్భంగా మంగళవారం ఆయనను యుటిఎఫ్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కదిరి డివిజన్ పరిధిలోని 6 మండలాలలోని దాదాపు 21 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 1045 మంది విద్యార్థులకు దాదాపు లక్ష రూపాయలు విలువ గల యూటీఎఫ్ ఎస్.ఎస్.సి మాదిరి పరీక్ష పత్రాలు పుస్తకాలను 2025 డిసెంబర్ నెలలో ఉచితముగా అందించడం జరిగింది. అంతేకాక ప్రభుత్వ ఉపాధ్యాయులు నిత్య విద్యా బోధనతో తీరిక లేకుండా నిరంతరం విద్యార్థులతో పాఠశాలలో పని భారంతో ఉన్న సమయంలో వారిలో మానసిక ఉల్లాసం కలిగించాలని లక్ష్యంతో టీచర్స్ ఫెస్ట్ అనే క్రీడా పోటీలు నిర్వహించి వారికి బహుమతులు అందజేశారు. అదేవిధంగా జాతీయ మహిళ ఉపాధ్యాయ దినోత్సవం సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని 04వ తేదిన కదిరి పరిసర 10 మండలాల లోని 33 మంది మహిళ ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానించడం జరిగింది.




నిస్సార్ తల్లిదండ్రులైన ఉపాధ్యాయులు మైనుద్దీన్,షమీం గార్ల పర్యవేక్షణలో విద్య, వైద్య రంగంలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ నిసార్ యాసిన్ ఖాన్ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

అతి చిన్న వయసులో విద్య, వైద్య మరియు సామాజిక రంగంలో సేవా కార్యక్రమాలు చేస్తున్న యువకిశోరానికి ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కదిరి డివిజన్ ఆధ్వర్యంలో యుటిఎఫ్ శ్రీ సత్యసాయి జిల్లా యూటీఎఫ్ అధ్యక్షులు డి. శ్రీనివాసులు అధ్యక్షతన రాష్ట్ర కౌన్సిలర్ చెన్నూర్ తాహిర్ వలి, జిల్లా కార్యదర్శులు మల్లికార్జున, రవివర్ధన్ రెడ్డి జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సునీల్ కుమార్, జిల్లా క్రీడల కమిటీ కన్వీనర్ ఆజం బాషా, జిల్లా మున్సిపల్ కమిటీ కన్వీనర్ మధుసూదన్, జిల్లా సిపిఎస్ సబ్ కమిటీ కో కన్వీనర్ సంతోష్ కుమార్ లు జ్ఞాపిక, దుశ్శాలువ, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి రాజేష్,నాగరాజు హనీఫ్, రమణ నాయక్, ఖాదర్ భాషా, ప్రసాద్, నజీర్ బ్రహ్మేంద్ర ఖాజాపీర్,రమేష్ , సుధాకర్ , హేమ సుందర్ రెడ్డి, షఫీఉల్లా,మనోహర్, బాలాజీ నాయక్, రవి నాయక్ , షరీఫ్,గణేష్, మహేశ్వర్ రెడ్డి, భార్గవ్,జయశంకర్, రజని, తస్నీమ్, వనజ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ ని విమర్శించే అర్హత ఆర్కే రోజాకి లేదు

**- జనసేన పార్టీ నేత దాసరి రవిశంకర్**




**వేంపల్లి - సూర్య వాస్తవం:** ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని, జన సైనికులను, వీర మహిళలను ఘాటయిన పదజాలం తో విమర్శించిన మాజీ మంత్రి రోజా ని పులివెందుల జన సేన సీనియర్ నాయకుడు దాసరి రవిశంకర్ హెచ్చరిస్తూ..., 21 కి 21 సీట్స్ తెచ్చుకొని 100శాతం స్ట్రైకింగ్ రేట్ తో రాష్ట్రంలో తన ముద్రతో ముందుకు వెళ్తూ దేశం లోనే మచ్చ లేని, అవినీతి లేని నాయకులు, యూత్ కు ఆదర్శ నాయకులు గౌరవ పవన్ కళ్యాణ్ ని విమర్శించే స్థాయి నీకు ఉందా ?. ఇలా పవన్ ని, జన సైనికులను, వీర మహిళల ను అవమాన పరిచే విధంగా ఇంకోసారి అదుపు లేకుండా నోరు పారే సు కుంటే, ఆయన జండా ఇష్టం తో మోసే జనసైనికులు, వీర మహిళలతో నిన్ను, నీ ఇంటిని ముట్టడించి ఆయనకు నీతో క్షమాపణ చెప్పించే వరకూ పోరాడుతాం అని తీవ్రంగా హెచ్చ రించారు. ఈ కార్యక్రమానికి జనసేన మండల నాయకుడు గోసల ఆంజనేయులు, నరసింహ రెడ్డీ, చాన్ భాష,తదితరులు పాల్గొన్నారు .




## శుభ్రమైన నీటిని విద్యార్థులకు అందించండి

**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం:** విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం పెట్టే సమయంలో శుభ్రమైన నీటిని అందించాలని ఎంపీడీవో రెడ్డయ్య పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో సభా భవనంలో మండలంలోని ప్రధానోపాధ్యాయులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీళ్లల్లో ఎలాంటి మలినాలు లేని నీటిని విద్యార్థులకు అందించాలన్నారు. అంతే కాకుండా ప్రతిరోజు నీటిని పరిశీలించి విద్యార్థులకు ఇవ్వాలన్నారు. శుభ్రమైన నీటిని అందించకపోతే ఆ నీరు త్రాగడం వల్ల విద్యార్థులు ఆసుపత్రి పాలవుతారు కాబట్టి ప్రధానోపాధ్యాయులు గెట్టి చర్యలు తీసుకొని ప్రతిరోజు నీటిని పరిశీలించి విద్యార్థులకు శుభ్రమైన నీటిని అందించాలన్నారు. అంతేకాకుండా మధ్యాహ్న భోజన సమయంలో వంట పూర్తయిన తర్వాత మూతలు సక్రమంగా పెట్టి విద్యార్థులకు అందించాలన్నారు. వంట పూర్తి అయిన తర్వాత మూతలు సక్రంగా పెట్టకుండా ఇష్టానుసారం పెడితే పిల్లలకు విరేచనాలు వాంతులు అవుతాయని ఆయన అన్నారు. కాబట్టి మధ్యాహ్న భోజన సమయములో త్రాగునీటి పై ప్రధానోపాధ్యాయులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం ప్రధానోపాధ్యా యునికి నీటిని పరిశీలించే కిట్లను అందజేశారు. ఈ కార్య క్రమంలో ఎంఈఓలు చక్రే నాయక్ వెంకటసుబ్బయ్య ఏపీ మో డల్ స్కూల్ ప్రిన్సిపాల్ వరాల రమేష్ ఆర్ డబ్ల్యూ డి ఈ దివ్య ఏ.ఈ కిషోర్ కుమార్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# హౌసింగ్ నిర్మాణానికి అడ్డంకులు..
# వైసీపీ మాజీ ఎమ్మెల్యే చలువే

- వైయస్ రాజారెడ్డి కుటుంబంలో ముసలానికి అవినాష్ రెడ్డే కారణం
- ఒక్క రూపాయి అవినీతి చేశానని నిరూపిస్తే రాజకీయాలు వదులుకుంటా
- పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జి బీటెక్ రవి మండిపాటు




**పులివెందుల– సూర్య వాస్తవం:** పులివెందులలో జగన్ రెడ్డి హయాంలో మొదలుపెట్టిన హౌసింగ్ కాలనీ నిర్మాణానికి అడ్డంకులు సృష్టించినది వైసీపీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ప్రధాన కారణమని, వైయస్ రాజారెడ్డి కుటుంబంలో ముసలము సృష్టించి పబ్బం గడుపుకుంటున్నది ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి అని, ఒక్క రూపాయి అవినీతి చేశానని నిరూపిస్తే రాజకీయాల నుండి శాశ్వతంగా వైద్యులకుతానని ఇటీవల ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై పులివెందుల టిడిపి ఇన్చార్జ్ బీటెక్ రవి మండిపడ్డారు. మంగళవారం పులివెందుల టిడిపి కార్యాలయము నందు మార్కెట్ యార్డ్ చైర్మన్ అమర్నాథ్, స్కిల్ డెవలప్మెంట్ డైరెక్టర్ మరి ఇతర నాయకులతో కలిసి ఏర్పాటు చేసినటువంటి విలేకరుల సమావేశంలో బీటెక్ రవి ప్రసంగిస్తూ ఎంపీ అవినాష్ రెడ్డి మా పార్టీ తరఫున ప్రశ్నిస్తే వాడికి సమాధానం చెప్పకుండా వారి అభిప్రాయాలను తెలియజేయడం సరికాదని, పులివెందులలో హౌసింగ్ వ్యవస్థ నిర్మాణ వ్యయానికి సంబంధించి అధిక మొత్తంలో బిల్లులు చెల్లించామనడం సరికాదని, అంత మొత్తంలో బిల్లులు తీసుకున్న తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పులివెందుల హౌసింగ్ కాలనీల విషయాన్ని కోర్టు పరిధిలోకి ఎందుకు తీసుకొచ్చారో చెప్పాలని, పులివెందులలో అభివృద్ధి పనులకు సంబంధించి ఇతర నాయకులకు చెల్లించాల్సిన బిల్లులలో నిర్లక్ష్యం వహించి ప్రకాష్ రెడ్డికే అధిక మొత్తంలో చెల్లించడం సరికాదని ప్రశ్నించారు, వివేకానంద రెడ్డిని మీరే హత్య చేసి మా మీద వేయాలనుకున్నరు మీ అంత తెలివి మాకు లేదని, సిబిఐ వాళ్ళు అరెస్టు చేయడానికి వస్తే మీ అమ్మను అడ్డం పెట్టుకొని హాస్పిటల్ లో ఆడిన నాటకం అందరికీ తెలుసునని, వైయస్ రాజారెడ్డి కుటుం బంలో ముసలం సృష్టించి జగన్ రెడ్డికి మరియు వైఎస్ విజయమ్మను దూరం చేయడం, షర్మిలను దూరం చేయడం అదే విధంగా బాబాయిని అంతముందించి ఏమీ తెలియనట్లు వ్యవహరించడం అవినాష్ రెడ్డికే చెల్లిందని, కర్ణాటకలోని ధార్వాడ్ యూనివర్సిటీ నందు ఫస్ట్ క్లాస్ లో బీటెక్ ఉత్తీర్ణత సాధించడం, ఫస్ట్ క్లాస్ అంటే జగన్ రెడ్డి సాధించినటువంటి ఫస్ట్ క్లాసుల కంటే భిన్నమని, పులివెందుల నియోజకవర్గంలో మైనింగ్ సంపదను వైయస్ భాస్కర్ రెడ్డి, మదన్ మోహన్ రెడ్డి, భయపరెడ్డి, వేల్పుల రాము, శివశంకర్ రెడ్డి లే అన్ని రంగాలలో కమిషన్ల ఆర్జించి దోచుకున్నారని, ఈ ప్రాంతం నుండి ముఖ్య మంత్రి స్థాయి వరకు ఎదిగి అభివృద్ధి చేసిన వైయస్ రాజశేఖర్ రెడ్డి అంటే మాకు ఇప్పటికీ గౌరవమేనని, 2019 నుంచి 24 వరకు ప్రజలకు మీరేం చేశారో తెలియజేయాలన్నదే మా సంకల్పమని, మీ ప్రభుత్వ హయాంలో ఎర్రబల్లె చెరువుకు నీటిని తేక పోవడం దేనికి సూచికమని ఈ ప్రాంత ప్రజల ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వడమే మీ అంతర్యమని తెలియజేస్తూ ఇప్ప టికైనా డొంక తిరుగుడు మాటలు పక్కనపెట్టి అడిగిన వాటికి స్ట్రైట్ గా సమాధానం ఇవ్వాలని బీటెక్ రవి డిమాండ్ చేశారు.

# చిరుధాన్యాల ఆహార పదార్థాల తయారీ విధానం ప్రదర్శన




**పులివెందుల– సూర్య వాస్తవం:** పులివెందులలోని ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాలకు చెందిన నాల్గవ సంవత్సర ఎన్.ఎస్.ఎస్ విద్యార్థి వాలంటీర్లు (జాతీయ సేవా పథకంలో భాగంగా ఏడు రోజుల పాటు అనగా 02 జనవరి నుండి 08 జనవరి వరకు లింగాల మండలం పెద్దకుడాల గ్రామంలో ప్రత్యేక శిభిరాన్ని నిర్వహిస్తున్నారు. ఐదవ రోజు మంగళవారం చిరుధాన్యాల విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆహార ఉత్పత్తులలో కల్తీని కనుగొనే ప్రదర్శన నిర్వహించారు. నాల్గొవ సంవత్సర ఎన్.ఎస్.ఎస్ విద్యార్థి వాలంటీర్లు అతి సులువుగా రాగి లడ్డు, మల్టీమిల్లెట్ ఫ్లోర్ (మిశ్రమ చిరుధాన్యాల పిండి) మొదలగు ఇతర చిరుధాన్యాల ఆహార పదార్థాల తయారీ విధానాలు స్వయంగా ప్రదర్శన చేసి చూపించారు. ఈ సందర్భంగా అధ్యాపకుడు డాక్టర్ జాకీర్ భాషా మాట్లాడుతూ ఇటువంటి విలువ ఆధారిత ఉత్పత్తుల ఆవశ్యకత, వాటి ఉపయోగాలు గ్రామస్థులకు విపులంగా వివరించారు. ఈ సందర్భంగా బయట కంపెనీలతో పోలిస్తే కళాశాల వారు తయారు చేసిన ఆహార పదార్థాలు చాలా స్వచ్ఛముగా సులభమైన పద్దతిలో ఉందని కొందరు గ్రామస్థులు పేర్కొన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం గ్రామంలో ఏర్పాటు చేసిన ఆహార ఉత్పత్తులలో కల్తీని కనుగొనే ప్రదర్శనలో నాల్గవ సంవత్సర ఎన్ఎస్ఎస్ విద్యార్థి వాలంటీర్లు పాల్గొని పసుపు, ఉప్పు, తేనె, నెయ్యి, కారంపొడి మొదలగు ఆహార పదార్థాలు కల్తీని సులభమైన పద్ధతిలో ఎలా కనుగొనాలో కొందరు గ్రామస్తులకు ప్రదర్శన చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో ఉత్సాహవంతులైన గ్రామస్థులు, కళాశాల జాతియ సేవా పథకము కార్యక్రమ అధికారి డాక్టర్. జయమ్మ, అధ్యాపకులు డాక్టర్ రాజేష్, డాక్టర్. జాకిర్ బాషా, నాల్గొవ సంవత్సర ఎన్.ఎస్.ఎస్ విద్యార్థి వాలంటీర్లు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# బాపూ ఉపాధి పథకం విబి జీ రామ్ జీ కాషాయం

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్





**కడప బ్యూరో – సూర్య వాస్తవం:** బడుగు జీవులు, కార్మికులు, వలస కూలీల పాలిట వరప్రసాదీని పథకంగా పేరొందిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తూ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోడీ వి బి జి రామ్ జి అనే కాషాయ పథకాన్ని తీసుకువచ్చారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ ధ్వజమెత్తారు. దీనికి నిరూపణగా వైయస్సార్ కడప జిల్లాలోని మైదుకూరు నియోజకవర్గం ఖాజీపేట మండల కేంద్రంలో ఉన్న జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహం చేతిలో మతోన్మాదులు ఆర్ఎస్ఎస్ జెండాను ఉంచారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ దీన్ని పూర్తిగా ఖండిస్తున్నట్లు స్పష్టం చేశారు. కడపలోని తన కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మత విద్వేష పాలకుడిగా ప్రధాని నరేంద్ర మోడీ పరిపాలన సాగిస్తున్నాడని ఆరోపించారు. ఇప్పటివరకు కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సదరు పథకం ద్వారా దేశవ్యాప్తంగా సుమారు 87 వేల కోట్ల రూపాయల అభివృద్ధి పనులు జరిగాయన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టే ఉద్దేశంతో పాటుగా ఉపాధి హామీ కూడా లభించే విధంగా స్వర్గీయ మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ దీనికి రూపకల్పన చేశారన్నారు. ఢిల్లీ నుంచి గల్లీ దాకా ఈ పథకం అత్యంత అద్భుతంగా విజయం సాధించినట్లు తెలిపారు. దీన్ని చూసి ఓర్వలేని మతవిద్వేష ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మహాత్మా గాంధీ ఉపాధి పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశాడని ఆరోపించారు. రాజకీయ కుట్రచేసిన నరేంద్ర మోడీ దీని స్థానంలో విబి జీవిజీ రాంజీ అనే పథకాన్ని తీసుకువచ్చాడని ఆరోపించారు. ఈ కొత్త పథకం ద్వారా పూర్తిగా ఆర్థిక భారాన్ని రాష్ట్రాలపై నెట్టివేశాడని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకానికి ఏటా పదివేల కోట్ల రూపాయ లు ఒక్కో రాష్ట్రానికి గ్రాంటు లభించేదన్నారు. కానీ వి బిజిరాంజీ పథకం ద్వారా నాలుగు వేల కోట్లు రాష్ట్రం భరించాల్సి ఉంటుందన్నారు. ఆరువేల కోట్లు కేంద్రం ఇస్తుందని కొత్త పథకంలో పేర్కొనడం మోసపూరితమన్నారు.

దీంతో రాష్ట్రాలు ఈ అదనపు భారం భరించలేక పథకానికి పూర్తిగా స్వస్తి పలికే విధంగా కేంద్రం కుట్ర చేసిందని తెలిపారు. పేదల కూలీల కడుపు కొడుతున్న ఎన్డీఏ ప్రభుత్వం మోసాన్ని ప్రజలకు తెలియజేసేందుకు లోక్సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ , ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున కరిగే నేతృత్వంలో మహాత్మా గాంధీ ఉపాధి పథకం అమలు చేయాలని ఈ నెల 10వ తేదీ నుండి ఫిబ్రవరి నెల వరకు దశల వారి ఉద్యమాన్ని కాంగ్రెస్ పార్టీ చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. దశలవారిగా దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, నాయకులు ఎన్డీఏ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేనున్నట్లు వివరించారు. జాతిపిత మహాత్మా గాంధీ పేరిట విజయవంతంగా అమలవుతున్న పథకం పేరు మార్పు తో పాటుగా సదరు పథకాన్ని నిర్వీర్యం చేయడం దేశద్రోహ మేనని ఆరోపించారు. 11 సంవత్సరాల పాటు పాటు దేశ ఆర్థిక వ్యవస్థను పూర్తిగా ధ్వంసం చేసిన నరేంద్ర మోడీ , ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్, హొం మంత్రి అమిత్ షా పై ప్రజలు వివిధ రాష్ట్రాల్లో తిరుగుబాటు చేస్తున్నారన్నారు. బిజెపితో పాటుగా ఎన్డీఏ మిత్ర పక్షలైన తెలుగుదేశం, జనసేన, వైసిపి పార్టీల కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ , కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మయాన రహమతుల్లా ఖాన్, జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు ఎస్ .సి రాజుద్దీన్, పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమల్ బాషా తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల ప్రగతి, అదే సమాజ పురోగతి

- వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు అంబవరం ప్రభాకర్ రెడ్డి
- దివ్యాంగులకు గృహోపకరణాల వితరణ



**పులివెందుల– సూర్య వాస్తవం:** అంధవికలాంగుల ఆశాజ్యోతి లూయి బ్రెయిలీ 174వ వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని ముద్దనూరు రోడ్డులోగల వికలాంగుల కమ్యూనిటీ భవనంలో ఏర్పాటుచేసిన ఒక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వ్యవసాయశాఖ సహాయసంచాలకులు అంబవరం ప్రభాకర్ రెడ్డి, ప్రముఖ ఆధ్యాత్మిక చైతన్యకారుడు పలగాని శివనాథ్ యాదవ్ తో కలిసి, బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలవేసి ఘననివాళులర్పించారు. అనంతరం ఆయన ఆత్మశాంతికై రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి ఆర్థికసహాయంతో 20మంది దివ్యాంగులకు హాట్ బాక్సులు, స్టీల్ వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని వ్యవసాయ అధికారి ప్రభాకర్ రెడ్డిని, ఆధ్యాత్మిక చైతన్యకారుడు పలగాని శివనాథ్ యాదవ్ రాజ్‌ను వికలాంగుల నెట్ వర్క్ తరఫున దృశ్శాలువతో ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్రఅధ్యక్షులు డాక్టర్ ఇరికిరెడ్డి రఘునాథ్ రెడ్డి, కార్యదర్శి సునీల్, లింగాల మండల వికలాంగులసంఘం అధ్యక్షులు తమటం చంద్రఓబులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తల కుటుంబాలను అన్ని విధాల ఆదుకుంటాం

- ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి,
వై.నాగేశ్వరరావు యాదవ్ డిసిఎంఎస్ చైర్మన్

**ప్యాపిలి– సూర్య వాస్తవం :** ప్యాపిలి మండలం డోన్ నియోజకవర్గంలో బుధవారం ఉదయం లారీ ఢీకొట్టిన సంఘటనలో మృతులు కే.సురేంద్ర వై.రాజశేఖర్ మృతి చెందడం జరిగింది. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతున్ని కోరుకుంటూ వారి కుటుంబాలకు ప్రగాట సానుభూతి తెలియజేశారు. అదే ప్రమాదంలో గాయపడిన పి. సురేంద్రను పరామర్శించి తాత్కాలిక ఆర్థిక సహాయం అందించడం జరిగింది. అలాగే వారి కుటుంబానికి ధైర్యం చెప్పడం జరిగింది. ప్రమాదంలో చనిపోయిన కుటుంబాలకు అలాగే గాయపడిన కుటుంబానికి తెలుగుదేశం పార్టీ తరపున ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకొని వెళ్లి తగిన ఆర్థిక సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని,టీడీపీ నాయకుల మృతి పార్టీకి తీరని లోటని వై నాగేశ్వరరావు యాదవ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో, సుదర్శన్, వెంకటేష్,తిమ్మప్ప మధు, రామచంద్రుడు టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.





## జాతీయ రహదారి పనులను
# పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ



**శ్రీ సత్య సాయి బ్యూరో –సూర్య వాస్తవం:** బెంగళూరు విజయవాడ ఎకనామిక్ కారిడార్‌లో భాగంగా... పుట్టపర్తి మండలం వానవోలు వంకరకుంట మధ్య జాతీయ రహదారి 544జి ప్యాకేజీ 2 లో సోమవారం చేపట్టిన జాతీయ రహదారి పనులను.. మంగళవారం జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ తో కలిసి పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్.జాతీయ రహదారి 544 జి ఉ బెంగుళూరు విజయవాడ ఎకనమిక్ కారిడార్ పై నాలుగు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ లను సాధించడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు రాజ్ ఫత్ ఇన్ఫ్రాక్రాన్ ప్రయివేట్ లిమిటెడ్ సిఎండి జగదీష్ కదం.. కలెక్టర్ మరియు ఎస్పీలకు వివరించారు.ఈ సందర్భంగా రహదారి నిర్మాణం జరుగుతున్న ప్రాంతాన్ని మొత్తం కలియతిరిగి పరిశీలించారు. 52 కిలోమీటర్ల దూరం కంటిన్యుయస్ బ్యిటుమనస్ రోడ్డును 7 రోజుల పాటూ నిరంతరాయంగా నిర్మాణాన్ని సాగించి రికార్డు సాధిస్తామన్న ధీమాను నిర్మాణ సంస్థ సిఎండి వ్యక్తం చేశారు.

అలాగే తాము వేస్తున్న రోడ్డు 11.5 మీ వెడల్పు తో మూడు లేన్ల రోడ్డుగా ఉంటుందని ఇక ఈ మొత్తం దూరాన్ని సింగిల్ లేన్ గా పరగణిస్తే మొత్తం 156 కిలోమీటర్ల సింగిల్ లేన్ రోడ్డు అవుతుందని కలెక్టరుకు వివరించారు. ఇది తాము చేస్తున్న ఈ ప్రయత్నాలలో మొదటి రికార్డుకు సంబంధిం చినవని, అదేవిధంగా అత్యంత ఎక్కువ మొత్తంలో బ్యిటుమనస్ కాంక్రీట్‌కు సంబంధించిన నిర్మాణ సామగ్రిని వినియో గించడం అనేది తమ రెండవ రికార్డు అవుతుందని చెప్పారు. అలాగే 24 గంటలలో అత్యంత పొడవైన రోడ్డు నిర్మాణం లో కూడా రికార్డు సాధించడానికి ప్రయత్ని స్తున్నామని, దీంతో పాటూ 24 గంటలలో అత్యంత ఎక్కువ బ్యిటుమనస్ కాంక్రీట్ ను ఉపయోగించడం కూడా మరొక రికార్డు అవుతుందని ఇందుకు తమ ప్రయత్నాలు నిన్న ప్రారంభించినట్లు వివరించారు.

ఈ భారీ కార్యక్రమంలో షుమారు 600 మంది కి పైగా కార్మికులు, ఇంజనీర్లు పని చేస్తున్నట్లు అందరి సహకారంతో రికార్డులను సాధిస్తామన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు.జాతీయ రహదారి నిర్మాణంలో జిల్లా యంత్రాంగం తరఫున అవసరమైన పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని, లక్ష్యం మేర నిర్ణీత సమయంలో రహదారి నిర్మాణాన్ని పూర్తి చేసి గిన్నిస్ రికార్డు సాధించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి తాసిల్దార్ కళ్యాణ్ చక్రవర్తి, నిర్మాణ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )

# అవినాష్ రెడ్డి ఔన్నత్యం గురించి

# బ్లఫ్ మాస్టర్ చెప్పాల్సిన అవసరం లేదు

- వైయస్ కుటుంబంలో చీలికలు అర్హత లేని వ్యక్తులు చేసే వ్యాఖ్యలే
- పులివెందుల ప్రాంతానికి మంచి చేసే ఆలోచన బోగస్ రవికి ఇవ్వాలని ప్రార్థన
- బీటెక్ రవి వ్యాఖ్యలపై వైసీపీ నాయకుల కౌంటర్



**పులివెందుల - సూర్య వాస్తవం:** జిల్లా అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్న వైయస్ అవినాష్ రెడ్డి ఔన్నత్యం గురించి బ్లఫ్ మాస్టర్ బీటెక్ మాట్లాడాల్సిన అవసరం లేదని, వైయస్ కుటుంబంలో చీలికలు అర్హత లేని నీచ రాజకీయాలు చేసే వ్యక్తుల వ్యాఖ్యలు అని, పులివెందుల ప్రాంతానికి ఏదైనా మంచి చేయాలని ఆలోచనకి ఇవ్వాలని దేవున్ని ప్రార్థిస్తున్నా మని పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ మరియు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప ఆధ్వర్యంలోని వైకాపా నాయకులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జగన్ క్యాంపు కార్యాలయం నందు ఏర్పాటు చేసినటువంటి విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అవినాష్ రెడ్డి ప్రెస్ మీట్ కు కౌంటర్ ఇవ్వడానికి బోగస్ రవి ఏ నగరం లో ఉన్న స్థావరానికి వెళ్లి సలహాలు తీసుకొని వచ్చాడో దాదాపు వారం పైన సమయం పట్టిందా లేక జూద స్థావరాల నుంచి వచ్చే వాటాల విషయమై మీ అనుచరుల మధ్య వచ్చిన మనస్పర్థల కారణంగా మీ వారే పోలీస్ లకు ఫిర్యాదు చేసుకొని అరెస్ట్ అయితే పోలీస్ వారి పైనే దాడి చేసిన ఘటన నుంచి ప్రజలను డైవర్షన్ చేయడానికి ఇప్పుడు కౌంటర్ గుర్తుకు వచ్చిందని, హంద్రీ నీవా కాలువ నుండి గతంలో కూడ ఎర్రబల్లి చెరువుకు నీళ్లు ఇవ్వడం జరిగిందని నీటిని టైలెండ్ వరకు తీసుకు పోవాలంటే పెద్ద పైప్ లైన్ ద్వారా మనకు హక్కు గా ఉన్న చిత్రావతి జలాశయం నుండి అయితే ఎక్కువ మంది రైతులకు మేలు శాశ్వత పరిష్కారం అనే ఉద్దేశంతోనే, పై ప్రాంతంలో ఉన్న చెరువుల్లో నీరు సమృద్ధిగా నిండితే క్రింది ప్రాంతంలో ఉన్న చెరువుకు నీళ్లు రావడం సర్వసాధారణం కానీ దీన్ని కూడా గ్రావిటేషన్ ద్వారా నీరు ఇచ్చామని చెప్పుకొనే నీ లాంటి అవకాశవాది ఎవ్వరు ఉండరని, ఎక్కడో శ్రీశైలం దగ్గర ఉన్న కృష్ణానది నీటిని పులివెందుల కు తెచ్చిన ఘనత , అలాగే మన ప్రాతంలో దాదాపు ప్రతి గ్రామానికి ప్రతి చెరువుకు నీళ్లు తెప్పించింది వైయస్ కుటుంబమని, బోగస్ మాటలతో కేవలం కల్లబొల్లి మాటలు, అక్రమాలు , దౌర్జన్యాలు తప్ప ఒక్క రూపాయి అభివృద్ధి లేదు మన ప్రాంత ప్రజలకు మంచి చేసింది లేదని, వేముల లో రాత్రికి రాత్రి జరిగిన మైనింగ్ దోపిడీ లో నీకు నీ పార్టీ నేతలకు వాటాలు అందడం నిత్య సత్యమని, పులివెందుల ప్రాంతం లో నీ అనుచరులు లోపట్నూతల కార్డ్స్ వెంగళ్ రెడ్డి, పులివెందుల క్రిట్ బుకీ జీవుల రమణ ఇంకా నీ ప్రధాన అనుచరుల కనుసన్నల్లో దాదాపుమూడు జిల్లాల నుంచి పేకాట రాయుళ్లను తీసుకొచ్చి వారి గృహాల్లో అలాగే సింహాద్రిపురం, కసునూర్ లో జరిగే జూద స్థావరాల నుంచి నీకు ముడుపులు అందాయని, యథేచ్ఛగా సాగుతున్న ఇసుక, మైనింగ్ అక్రమ రవాణాలో నీకు నీ కుటుంబ సభ్యులకు వాటాలు ఉన్నాయని, పార్నపల్లి దగ్గర పట్టుబడిన అక్రమ రేషన్ బియ్యం రవాణాలో నీ హస్తం కలదని, వీటన్నిటిని పై ఏ దేవుడి సన్నిధిలోకి వచ్చి ప్రమాణ పూర్తిగా నీకు నీ కుటుంబ సభ్యులకు వాటాలు కలవని, పులి వెందులలో సాక్షత్తు మీ పార్టీ కి చెందిన మునిసిపల్ చైర్మెన్ అభ్యర్థి అని చెప్పుకొనే వ్యక్తి పేకాట లో పట్టుబడితే పోలీస్ స్టేషన్లోనే సబ్ ఇన్స్పెక్టర్ పై దాడి కి దిగుతుంటే ఇక సామా న్యుల పరిస్థితి ఏంటో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదని, నియో జకవర్గం లో ప్రతి ఇంటికి నీటిని అందించే వాటర్ గ్రిడ్ ప్రాజెక్ట్ పూర్తి చేసి జాతికి అంకితం చేయాలని కాకుండా పులివెందుల మున్సిపాలిటీ లో త్రాగునీటి కష్టాలు తీర్చాలని అడిగినట్లు నిరూపించు లేకపోతే రాజకీయ సన్యాసం చేస్తానని బోగస్ రవి ప్రమాణం చేయాలని, నువ్వు మాట్లాడిన మైనింగ్ గురించి ప్రభుత్వం చేత అన్ని రకాల అప్రూవల్ పొందిన మైన్ ఓనర్ దగ్గర నుంచి లేబర్ కాంట్రాక్టు క్రింద అగ్రిమెంట్ చేసుకొని లీగల్ గా మా నాయకులు చేసిన మైనింగ్ వ్యాపారం, మీ లాగా రాత్రికి రాత్రి ఉన్నదంతా కొల్లగొట్టి మైన్ నే మూసేసిన ఘనత మీదని, అవినాష్ రెడ్డి కి జిల్లా ప్రజలకు ఆయన పై ఉన్న ఆదరణ అభిమానాలకు అంతులేదు, గుండెల్లో పెట్టుకొని మూడు సార్లు ఎంపీగా గెలిపించారు. అలాంటి వ్యక్తి గురించి మాట్లాడే పేరు ఉచ్చరించే అర్హత కూడా నీకు లేదని, ఇకపోతే నోటితో మాట్లాడుతూ నొసలుతో వెక్కిరించే నిన్ను నీ చుట్టూ ఉన్న నీ మిత్రులు దావూద్ అని పిలుస్తుంటారు ఎందుకు పిలుస్తారో అది కూడా మీడియా ముందు చెపితే బాగుంటుందని హితువు పలికారు. ఈ కార్యక్రమంలో రెండవ వైస్ చైర్మన్ ఆఫీస్, కౌన్సిలర్ కిషోర్ మరియు మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ సర్వోత్తమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## న్యాయస్థానాన్ని అవమానించిన ఎస్ఐలపై

# చర్యలు తీసుకోకపోతే ఉద్యమాలను ఉధృతం చేస్తాం!

- ఏపీ బార్ కౌన్సిల్ మెంబర్ రామరెడ్డి




**పత్తికొండ - సూర్య వాస్తవం:** న్యాయస్థానాన్ని అవమానించిన ఎస్ఐలపై రాష్ట్ర ప్రభుత్వం, డిజిపి చర్యలు తీసుకోకపోతే న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని ఏపీ బార్ కౌన్సిల్ మెంబర్ రామిరెడ్డి, విజయవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏకే భాష, కర్నూలు సీనియర్ అడ్వకేట్స్ నాగలక్ష్మ దేవి, ఓంకార్ లు హెచ్చరించారు. న్యాయస్థానాన్ని అవమానించిన ఎస్ఐలపై చర్యలు తీసుకోవాలని మంగళవారం పత్తికొండ బార్ అసోసియేషన్ అధ్యక్షులు మధుబాబు ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి స్థానిక కోర్టు నుండి పాత బస్టాండ్ అంబేద్కర్ సర్కిల్ మీదుగా గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి అంబేద్కర్, గాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాల వేశారు. పత్తికొండ న్యాయవాదులు చేస్తున్న ర్యాలీకి ఏపీ బార్ కౌన్సిల్ మెంబర్ రామిరెడ్డి, విజయవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏకే భాష, కర్నూల్ సీనియర్ న్యాయవాదులు నాగలక్ష్మ దేవి ఓంకార్, ఆదోని, ఎమ్మిగనూరు, డోన్ బార్ అసోసియేషన్ ల అధ్యక్షులు శ్రీరాములు, రసీదుల్లా, ఎల్ కృష్ణ ప్రసాద్, ఆలూరు బార అసోసియేషన్ సెక్రటరీ సాకీర్ లు మద్దతు తెలిపి మాట్లాడారు. కోర్టులో లొంగిపోయేందుకు వచ్చిన ముద్దాయి శివన్నను చిప్పగిరి ఎస్సై సతీష్ కుమార్, పత్తికొండ ఎస్సై విజయ్ కుమార్ లు కాలర్ పట్టుకుని లాళ్లడం అన్యాయం అన్నారు. కోర్టులో లొంగి పోయేందుకు వచ్చిన ముద్దాయి శివన్నను ఇలా లాక్కెళ్లడం అన్యాయమని అడ్డు చెప్పేందుకు వచ్చిన రవికుమార్ అనే అడ్వకేటుపై దురుసుగా ప్రవర్తించడం హేయమైన చర్య అన్నారు. ఈ విషయంపై పత్తికొండ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదూలందరు రోడ్డెక్కి నిరసనలు, ర్యాలీలు చేపట్టారని పేర్కొన్నారు. న్యాయస్థానాన్ని అవమానించిన ఎస్ఐల పై చర్యలు తీసుకోవాలని చేపట్టిన ధర్నా కార్యక్రమాలకు కర్నూలు జిల్లాలోని బార్ అసోసియేషన్ లే కాక రాష్ట్రవ్యాప్తంగా అన్ని బార్ అసోసియేషన్ ల ఆధ్వర్యంలో న్యాయవాదులందరూ నిరసనలు, ర్యాలీలు చేపట్టారని వివరించారు. ఈ ఘటనపై కర్నూలు ఎస్పీ మరియు డిఐజి, హోమ్ మంత్రి స్పందించకపోవడం అన్యాయమని తెలిపారు. న్యాయస్థానాన్ని అవమానించిన ఎస్సై లపై చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పత్తికొండ సీనియర్ న్యాయవాదులు కారప్ప, ఎల్లారెడ్డి, గోపాల్ రెడ్డి, సురేష్ కుమార్, సత్యనారాయణ, పత్తికొండ, కర్నూలు, ఆదోని, డోను, ఎమ్మిగనూరు, ఆలూరు న్యాయవాదులు పాల్గొన్నారు.

# కపలవాయి విజయకుమార్ జన్మదిన వేడుకలు

**నరసరావుపేట - సూర్య వాస్తవం:** స్థానిక చిలకలూరిపేట రోడ్డులో గల అమ్మా నాన్నల ప్రేమాలయం వృద్ధాశ్రమంలో మంగళవారం మధ్యాహ్నం యస్.యస్. యన్ కళాశాల పాలకవర్గ అధ్యక్షులు మరియు ఆంధ్రప్రదేశ్ బులియన్ మర్చంట్స్ రాష్ట్ర అధ్యక్షులు కపలవాయి విజయకుమార్ 72వ జన్మదిన వేడుకలను cది టౌన్ వైడ్ సూపర్ స్టార్ కృష్ణ-మహేష్ బాబు యువశక్తి పట్టణ అధ్యక్షులు ఫారూఖ్ బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. హీరో కృష్ణ - మహేష్ బాబు అభిమానులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కపలవాయి విజయ కుమార్ పాల్గొని తన పుట్టిన రోజు సందర్భంగా ఏర్పాటుచేసిన కేక్ కట్ చేసి వృద్ధులకు మిఠాయిలు పంచి పెట్టారు. అనంతరం వృద్ధాశ్రమంలోని వారికి అన్నదాన



కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరో కృష్ణ-మహేష్ బాబు అభిమానులు యండి. షంషీర్ అలీ, షేక్. నాగుర్ వలి, మన్నేపల్లి శ్రీను, డి.నాగేశ్వరరావు, బి.మస్తాన్ రావు , షేక్.నబీ బాజీ, షేక్.సలాం,_.రమేష్ బాబు, యం.డి.అమీర్ మరియు ఆశ్రమ నిర్వాహకులు ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.




# మా ఇండ్లకు నష్టపరిహారం చెల్లించాలి

- ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద ఇండ్లు నిర్మించి ఇవ్వాలి
- చైర్మన్ వరప్రసాద్ ఆధ్వర్యంలో ఆర్డీవో చిన్నయ్యకు వినతి పత్రం ఇచ్చిన రాజారెడ్డి కాలనీ వాసులు



**పులివెందుల- సూర్య వాస్తవం :** పులివెందుల పట్టణంలోని రాజారెడ్డి కాలనీ సమీపంలో నేషనల్ హైవే రహదారి వెళ్తుండడంతో ఆ రోడ్డుకు సంబంధించి రాజారెడ్డి కాలనీలోని కొన్ని ఇండ్లు రోడ్డులోకి పోవడంతో ఇంటి యజమా నులకు ఎలాంటి నష్టపరిహారం ఇవ్వకుండా గుత్తేదారులు ఇళ్లకు మార్కింగులు వేయడం ఏమిటని కాలనీ ప్రజలు అంటున్నారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో ఆర్డిఓ చిన్నయ్యను మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తో కలిసి వెళ్లి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ వరప్రసాద్ మాట్లాడుతూ రాజారెడ్డి కాలనీలో దాదాపు ముప్పై ఇళ్లు పైన రోడ్డుకు పోతున్నాయని వాటికి ఎలాంటి నష్టపరిహారం చెల్లించకుండా గుత్తేదారులు ఇండ్లకు మార్కులు వేస్తున్నారని ఆయనకు తెలిపారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద ఏదో ఒకచోట ఇళ్లు కోల్పోయిన వారికి ఇళ్లను నిర్మించి ఇవ్వాలని అలాగే నష్టపరిహారం చెల్లించాలని ఆయనను కోరారు. ఇందుకు ఆయన స్పందిస్తూ ఉన్నతాధికార దృష్టికి, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి మీ సమస్యకు పరిష్కారం చేస్తామని వారికి తెలిపారు.

# పంట దిగుబడి పెంచేందుకు జీవ ఎరువులు అవసరం

- జిల్లా వనరుల కేంద్రం ఏడిఏ అశోక్ రెడ్డి
- రైతులకు అవగాహన, శిక్షణ



**వేంపల్లి - సూర్య వాస్తవం:** నేల సారుపృత, పంట దిగుబడి పెంచేందుకు జీవ ఎరువులు, ప్రకృతి కషాయాల వినియోగంలో ఎంతో అవసరమని జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు(ఏడిఏ) ఎస్.అశోక్ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, ఆర్.పి.ఎల్ పథకం కింద రైతులకు అవగాహన, శిక్షణ కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల్లో పురుగు మందుల వాడకాన్ని తగ్గించి, జీవవైవిధ్యాన్ని కాపాడుతూ తెగుళ్ల నివారణకు జీవకీటక నాశినలను వాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శివ శంకర్ రెడ్డి, కిసాన్ మిత్ర భాస్కర్, ఎఫ్ పీఓలు గాయత్రి, చంద్ర శేఖర్ రెడ్డి, ధనుంజయరెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్‌లో వర్క్‌షాప్




**వేంపల్లె - సూర్య వాస్తవం:** ఆర్జీయూకేటీ ఆర్ కే వ్యాలీ క్యాంపస్‌లో నేడు "సంస్థాగత నాణ్యత బలోపేతం, ఎన్ఎఎ సి అక్రిడిటేషను అంశంపై ఒక రోజు వర్క్‌షాప్‌ను విజయ వంతంగా నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌ను ఆర్‌కే వ్యాలీ ఐక్యు ఏసి సమన్వయకర్తలు కోటేశ్వరి, పెర్నపాటి నాగరాజ సమర్థ వంతంగా నిర్వహించగా, డైరెక్టర్ మార్గదర్శ కత్వంలో ఈ కార్యక్రమం సాగింది. ఎన్ఎఎసి అక్రిడిటేషన్‌లో అవసరమైన నాణ్యత ప్రమాణాలు, డేటా నిర్వహణ, డాక్యుమెంటేషన్ విధానాలు, ఏ క్యూ ఏ ఆర్ మరియు సిద్ధత వంటి కీలక అంశాలపై సమగ్ర అవగాహనను ఈ వర్క్‌షాప్‌లో అందించారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాధిపతులు ( హెచ్ ఓ డి ఎస్ ) మరియు వివిధ విభాగాల సమన్వయకర్తలు ఉత్సాహంగా పాల్గొని, చర్చల్లో చురుకుగా పాల్గొన్నారు. సంస్థ అకాడమిక్, పరిపాలనా నాణ్యతను మరింత మెరుగుపరచడంలో ఈ వర్క్‌షాప్ ఎంతో ఉపయుక్తంగా నిలిచిందని పాల్గొన్నవారు అభిప్రాయపడ్డారు. సంస్థ నాణ్యతాభివృద్ధి దిశగా ఈ వర్క్‌షాప్ ఒక కీలక అడుగుగా నిలిచిందని, అందరి సమిష్టి కృషితో కార్యక్రమం గొప్ప విజయంగా ముగిసిందని నిర్వాహకులు తెలిపారు.